ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి





# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674



శనివారం 22 ఆగస్టు 2026 | Saturday 22 August 2026 | హైదరాబాద్ Hyderabad
సంపుటి: 28 సంచిక: 133 | Vol.No 28 Issue No .133
పేజీలు: 12+12 | వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in


## కాకరేపుతున్న సురేఖ కూతురు

# సుష్మిత వ్యాఖ్యలు

- కొండా సురేఖపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత
- సిఎం సహా నేతలంతా చర్యలకు పట్టు



హైదరాబాద్,ఆగస్ట్21 : మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె సుస్మిత చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులి వ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు సురేఖ పార్టీ నుంచి వెళ్లిపోవడం మంచిదని పలువురు ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోక ముందే తప్పుకోవాలన్నారు, ముఖ్యమంత్రిపై తీవ్ర స్థాయిలో చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బుధవారం దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. దిల్లీలో

మిగతా 2లో..



## లండన్‌లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించిన సిఎం



బ్రిటన్,ఆగస్ట్21 : లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్

మిగతా 2లో..

## షావుకారు జానకికి సీఎం రేవంత్ సంతాపం

హైదరాబాద్,ఆగస్ట్21 : ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



మిగతా 2లో..

# సిఎం అమెరికా పర్యటన రద్దు

## లండన్‌లో పర్యట ముగించుకుని రానున్న రేవంత్



హైదరాబాద్, ఆగస్ట్20 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయ్యింది. ప్రస్తుతం ఆయన లండన్ పర్యటనలో ఉన్నారు. యూకే నుంచి అమెరికా వెళ్లాల్సిన ఆయన.. అక్కడకు వెళ్లకుండానే పర్యటనను రద్దు చేసుకుని

మిగతా 2లో..

### రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

**అందుకే సిఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ**

**విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ**




## పేదల సంక్షేమం.. భూ సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ ప్రాధాన్యత

## సెప్టెంబర్ 15లోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

- సర్వే మ్యాప్ తో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు
- జగిత్యాల జిల్లా పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జగిత్యాల,ఆగస్ట్21 అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో అర్హులైన లబ్ధిదారులను సెప్టెంబర్ 15లోగా తుది జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి జగిత్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్



కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మొత్తం ఆరు కార్యాలయాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధునిక వసతులతో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

**సెప్టెంబర్ 15లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక**

జిల్లాలో మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. L1, L2, L3 వంటి సాంకేతిక వర్గీకరణల కంటే అర్హతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిజమైన పేదలకు ఇళ్లు అందేలా

మిగతా 2లో..

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

- సవాళ్లను అవకాశంగా మార్చుకోవాలి
- అక్టోబర్, నవంబర్ నెలలు అత్యంత కీలకం..
- పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా చూడాలి
- భూగర్భ జలాలను అంచనా వేసి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలి
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల కష్టాలను తీర్చాలి
- వర్క్‌షాపులో పలువురు మంత్రుల సూచన



హైదరాబాద్,ఆగస్ట్21 :ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పటు చేయడం

మిగతా 2లో..

# ఫలించిన రాహుల్ పోరాటం

**పెల్లెట్ గన్ కాల్పులపై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు**

మిగతా 2లో..



## గ్లోబల్ స్థాయిలో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణ

**- సిఎస్ సంజయ్ జాజు**



హైదరాబాద్,ఆగస్ట్21 రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

మిగతా 2లో..

# నేడు కేరళకు పవన్ కళ్యాణ్

**ఆయుర్వేద థెరపీ చేయించుకోన్న డిప్యూటీ సిఎం**



అమరావతి,ఆగస్ట్21 : జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. శనివారం కేరళకు వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన.. వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు పవన్ కల్యాణ్‌కు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలకు, అధికారిక విధులకు దూరంగా ఉండాలని కూడా వైద్యులు

మిగతా 2లో..

# తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

- హైకోర్టులో ముగిసిన వాదనలు
- 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు




హైదరాబాద్,ఆగస్ట్21 : తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను

మిగతా 2లో..

# క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్ప

- కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు: కొండా సురేఖ



హైదరాబాద్,ఆగస్ట్21 : కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. 'నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను'అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# నేడు కేరళకు పవన్ కళ్యాణ్

సూచించినట్లు జనసేన కేంద్ర కార్యాలయం తెలిపింది. అయితే పాలనా బాధ్యతల నేపథ్యంలో ఆయన వారం రోజుల్లోనే క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ఆ తర్వాత ముందుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో శస్త్రచికిత్స చేసిన కుడి భుజం ప్రాంతంలో వాపు పెరగడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేలా చికిత్స తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే కేరళలోని ఆయుర్వేద వైద్యాలయంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స, విశ్రాంతికి ప్రాధాన్యత ఇస్తూనే తన పాలనా బాధ్యతలను కొనసాగించేందుకు పవన్ కల్యాణ్ ప్రయత్నిస్తున్నట్లు జనసేన కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

## లండన్‌లో ఆక్స్‌ఫర్ యూనివర్సిటీని సందర్శించిన సిఎం

మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి భారతదేశంతోనూ ప్రత్యేక అనుబంధం ఉందని.. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు ఉన్నారు.

## షావుకారు జానకికి సీఎం రేవంత్ సంతాపం

తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి గారు దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఫలించిన రాహుల్ పోరాటం

న్యూఢిల్లీ,ఆగస్ట్21 : కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ విపక్షనేత రాహుల్ గాంధీ పోరాటం ఫలించింది. రాహుల్ పోరాటానికి కేంద్రం మెడలు వంచింది. రాహుల్ ధర్నాకి తలొగ్గిన ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్ దగ్గర సీజేపీ చలో పార్లమెంట్ నిరసనల్లో పెల్లెట్ గన్ కాల్పులపై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జులై 20న విద్యార్థులు చలో పార్లమెంట్ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారు. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్, పె÷-లలెట్ గన్స్ ప్రయోగించారు. సాహిల్ లోచబ్ అనే నిరసనకారుడు పె÷-లలెట్ గన్ కాల్పుల వల్ల తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో సాహిల్ లోచబ్ శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆశ్రయించాడు. రాహుల్ గాంధీ స్వయంగా సాహిల్, అతని కుటుంబ సభ్యులను తీసుకుని స్టేషన్?కు వెళ్లి బాధితుడి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరాడు. కానీ పోలీసులు కేసు రిజిస్టర్ చేసేందుకు ఒప్పుకోలేదు. దీంతో రాహుల్ గాంధీ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగాడు. బాధితుడి శరీరంలో 200కు పైగా పె÷-లలెట్ షెల్స్ ఉన్నాయని.. ఒక కంటి చూపు కోల్పోయినప్పటికీ కేసు నమోదు చేయరా అని పోలీసులు, కేంద్ర ప్రభుత్వం ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ ధర్నాకు సంఘీభావంగా కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున స్టేషన్ దగ్గరకు చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని రాహుల్ తెగేసి చెప్పాడు. కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసనలు, రాహుల్ గాంధీ పట్టుబట్టడంతో ఎట్టకేలకు దిగొచ్చిన ఢిల్లీ పోలీసులు బాధితుడు సాహిల్ లోచబ్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు.

# తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఏఃఔ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# గ్లోబల్ స్థాయిలో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణ

సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్రసాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్ పో (జు×జూశీం)లను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలిను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ శ్రీ కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ శ్రీ అజిత్ రెడ్డి, శ్రీ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం అమెరికా పర్యటన రద్దు

తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 19 నుంచి 30 వరకు పదిరోజుల పాటు విదేశాల్లో సీఎం పర్యటించాల్సి ఉంది. విదేశీ పర్యటనలో భాగంగా బ్రిటన్‌తో పాటు అమెరికాలో ఉన్న ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి విద్యా విధానం, స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో ఆయా దేశాలు ఎలాంటి విధానాలను అవలంబిస్తున్నాయనే దానిపై ముఖ్యమంత్రి అధ్యయనం చేయాల్సి ఉంది. పలు అంతర్జాతీయ యూనివర్సిటీలను సందర్శించే విధంగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ప్రస్తుతం లండన్‌లో ఉన్న సీఎం.. అక్కడ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించాల్సి ఉంది. 23 వరకు లండన్‌లో పర్యటించనున్న సీఎం.. అక్కడి నుంచి అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. ఈనెల 29 వరకు అమెరికాలో పర్యటించి.. తిరిగి 30న హైదరాబాద్‌కు తిరిగి రావాల్సి ఉంది. అయితే, విదేశీ పర్యటనలకు వెళ్తున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం సీఎంవో అధికారులు దరఖాస్తు చేశారు. యూకే పర్యటనకు అనుమతి లభించినప్పటికీ, అమెరికా పర్యటనకు అనుమతి లభించకపోవడంతోనే సీఎం రేవంత్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు సమాచారం.

## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం



హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు. ల్గ÷తులను ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా రైతుకు నష్టం రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆయిల్‌పామ్ సాగును



విస్తరించాలని సూచించారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించవచ్చన్నారు. ÷లంగాణను దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, రైతులకు లాభదాయకమైన వ్యవసాయాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉద్యాన రంగాన్ని కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి తెలంగాణను పొరుగు రాష్ట్రాలకు దీటుగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ల్గ÷తుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుగానే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం తదితర అంశాలపై నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ఆరు నెలలుగా వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు రైతాంగ సమస్యలపై నిరంతరం చర్చిస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పశువులు, అటవీ జంతువులకు కూడా నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గతంలో కరువు పరిస్థితుల్లో గ్రామాల వెలుపల పశువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసినట్లుగానే, అవసరమైతే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు కూడా నీటి సదుపాయం కల్పించాలని అన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడుతూ అన్ని జీవులు సమానంగా జీవించే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉండాలి' అనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి పనిచేయాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. 'ప్రతి గ్రామానికి నీటి బ్జడెట్ ? ప్రతి రైతుకు నీటి భద్రత ? ప్రతి ఎకరానికి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం' అనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు.

# పేదల సంక్షేమం.. భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత

శాసనసభ్యులు, ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల సెప్టెంబర్ 15 నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కూడా తుది చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా మరోసారి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు.

భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

రాష్ట్రంలో చేపడుతున్న భూ రీ సర్వే అత్యంత కీలకమైన కార్యక్రమమని మంత్రి పొంగులేటి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే రీ సర్వే ప్రధాన లక్ష్యమని, అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు.

సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు మ్యాప్ అందిస్తే భవిష్యత్‌లో డిస్ప్యూట్‌లకు అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ఇది రెవెన్యూ శాఖలో కొత్త శకానికి నాంది పలికే కార్యక్రమమని, కలెక్టర్లకు అనుభవంతో కూడిన ఉన్నత సవాలు అని అన్నారు. సర్వే నిర్వహించే సర్వేయర్లకు నిర్ణీత మొత్తాన్ని ప్రతి 15 రోజులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త విధానాలు



రిజిస్ట్రేషన్ శాఖలో పాత తరహా విధానాలకు స్వస్తి పలికి ప్రజలకు మరింత సులభతరంగా, పారదర్శకంగా సేవలు అందించే కొత్త విధానాలను తీసుకురాబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసైన్డ్ భూముల అంశంపై శాసనసభలో విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీకి రూ.32 కోట్లతో మౌలిక వసతులు నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తామన్నారు. కాలనీలో రేషన్ దుకాణం, బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10,365 ఇందిరమ్మ ఇళు ్ల మంజూరు కాగా, 8,079 మంది లబ్ధిదారులకు రూ.227.32 కోట్లు విడుదలైనట్లు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రులు ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, చెరువులో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు.

# కాకరేపుతున్న సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యలు

ఉన్నప్పుడే కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరికొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ బుధవారం మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలినని గురువారం సమాచారం ఇచ్చారు. మూడ్రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకోవడంతో పాటు ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. ఇదే సమయంలో మంత్రి మాజీ ఓఎస్డీ సుమంత్‌పై గురువారం కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో ఈ కేసును పోలీసులు నమోదు చేశారు. గతంలో ఓ వివాదంలో ఇతనిని అరెస్టు చేయడానికి ప్రయత్నించినపుడు కూడా కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ సమయంలో పార్టీలోని కొందరి జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినా, తాజా పరిణామాల్లో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఇలాంటి వ్యవహారాల్లో ఆచితూచి అడుగేయాలనే అభిప్రాయం కూడా పార్టీలో కొందరు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తమ్మీద ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయం అని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆమె మాటలపై వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖకు ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. మంత్రి వివరణను పరిశీలించాక ఏం చేయాలో ఆలోచిస్తాం' అని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీకి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎవరికి వారు పలానా స్థానం నుంచి పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. టికెట్లు ఇవ్వడంలో సీడబ్ల్యూసీ, అధిష్ఠానానిదే తుది నిర్ణయం. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వంపై ఎందుకు వ్యాఖ్యలు చేశారు? ఆయన ఆవేదన ఏమిటి? అనేది అర్థం చేసుకున్నాం. ఆ నియోజకవర్గంలోని కొత్త, పాత నేతలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. నిషేధిత భూములకు సంబంధించిన 22ఏ పై భారాస అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పులను సరిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని వివరించారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రియాంక బెటర్ ఛాయిస్

పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తీరును గమనిస్తే..ప్రతిపక్షాలు సభను స్తంభించడం మినహా చేసిందేమీ లేదు. లోపలా, బయటా ప్రియాంక తీరు ఆశాజనకంగా ఉంది. ఆమె సపందర్భోచితంగా మాట్లాడుతున్నారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ గలుగు తున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగలరని భావించవచ్చు. పార్మలెంటులో సమస్యలపై ఆమె అవగాహనతో మాట్లాడుతున్నారు. ఎందుకంటే రాహుల్ కేవలం మోడీ లక్ష్యంగా చేస్తున్న విమర్శలు పెద్దగా ఆకట్టుకోలేక పోతున్నాయి. మోడీని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. లోక్‌సభలో అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. గత సమావేవాల్లో వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించండ లేదు. డీ లిమిటేషన్‌పై మళ్లీ పార్లమెంట్ పెడితే ప్రియాంకను ముందు పటెట్టం మంచిది. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం చేయగలదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధం ఆకట్టుకుంది. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరగాలి. సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది విపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఆమెను ముందు నిలబెడితే మంచిది.



## కలశ వందన అభియాన్‌ను విజయవంతం చేయాలి

**- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు**



సంగారెడ్డి బ్యూరో ఆగస్టు :21( విజన్ ఆంధ్ర ): బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలశ వందన అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంటి అలియాస్ ఎస్. ప్రభు పిలుపునిచ్చారు.ద శు క్రవారం నాడు సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ 650వ జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సంత్ రవిదాస్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, కులవర్గ భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రవిదాస్ మహారాజ్ చూపిన సమరసతా మార్గాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాశీలోని సంత్ రవిదాస్ మహారాజ్ జన్మస్థలం శ్రీ గోవర్ధనాపూర్ పవిత్ర క్షేత్రం నుంచి సేకరించిన మట్టితో పూజించిన పవిత్ర కలశాలను దేశంలోని అన్ని రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు. తెలంగాణకు వచ్చిన పవిత్ర కలశాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాలకు తీసుకెళ్లి, ప్రతి ప్రాంతంలో సంత్ రవిదాస్ మహారాజ్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చంటి ప్రభు తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణలోని 33 జిల్లాలకు పవిత్ర కలశాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు, పార్టీ పదాధికారులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి కలశ వందన అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంటి ప్రభు కోరారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులు రాజేందర్, అవన్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం నీటితో చెరువులు నింపాలి

**- బిఆర్ఎస్ నేతల డిమాండ్**

యాదాద్రి,ఆగస్ట్21 : వర్షాభావంతో ఎండిపోతున్న పంటలను ఆదుకునేందుకు ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను కాళేశ్వరం జలాలతో నింపి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శు క్రవారం రాజాపేట మండలం బొందుగులలో ఎండిపోయిన పంట పొలాలు, చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూరి రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పంటలు ఎండిపోతున్నాయన్న సమాచారంతో క్షేత్రస్థాయిలో పరిశీలించగా, నాట్లు వేసిన 25 రోజులకే పంటలు ఎండిపోతున్న దుస్థితి కనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 50 నుంచి 60 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, మరో 100 ఎకరాల వరకు పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని చూసి గుండె తరుక్కుపోయిందన్నారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా పాడిపంటలతో కళకళలాడిందని అన్నారు. గత ఏడాది ఆలేరు నియోజకవర్గంలో 1,000 చెరువులు నింపామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారని, ప్రస్తుతం వర్షాలు లేక చెరువులు, బోర్లు, బావులు ఎండిపోతున్నా చెరువులు నింపాలనే సోయి ఎందుకు లేదని ప్రశ్నించారు. తక్షణమే కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నింపి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తపాస్‌పల్లి జలాలతో బొందుగుల చెరువును నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ, విదేశీ పర్యటనలు చేస్తూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మాజీ ఎంపీపీ బాలమణి యాదగిరిగౌడ్, జల సాధన సమితి అధ్యక్షుడు ఎర్ర గోకుల జశ్వంత్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు, ఉపసర్పంచ్ యండి అబీద్, నాయకులు గుండెగోని శీను, రాంగోపాల్‌రెడ్డి, వరిమడ్ల బాలకృష్ణ, స్వామి, నిమ్మల సుదర్శన్, బోయిని రాజు, మాపు భాస్కర్ పాల్గొన్నారు.

## పాలిటెక్నికకల విలీనంతో నష్టం లేదు: వివేక్

హైదరాబాద్,ఆగస్ట్21 : నగరంలోని మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మంత్రి వివేక్ ముఖాముఖి నిర్వహించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖ పరిధిలోకి తెచ్చిన నేపథ్యంలో విద్యార్థులు పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒక్కో అంశంపై మంత్రి వారికి స్పష్టత ఇచ్చారు. ఫీజలు, పరీక్షలు, ఈసెట్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వివరించారు. ఇప్పటికే చదువుతున్న విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలగదని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్‌లలో అభివృద్ధి, ఆధునిక సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలతో అనుసంధానం, ఉపాధి కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు.

## సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్

ఆదిలాబాద్,ఆగస్ట్21 : బిహార్‌కు చెందిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన ఐదుగురు నిందితులపై దేశవ్యాప్తంగా 498 కేసులు ఉన్నాయి. తెలంగాణలో 90 ఫిర్యాదులు నమోదయ్యాయి. నిందితుల నుంచి రూ.70వేల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.8 లక్షలను సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో భగ్గుమంటున్న అసంతృప్తి

### “పాత వర్సెస్ కొత్త“ తగాదా - ప్రతి జిల్లాలో గ్రూపు రాజకీయం





ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 21: 10 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాతలి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు అంతర్గత గ్రూపు రాజకీయాలు తీవ్రంగా ముదురుతున్నాయి. అధికారం కోసం ఏకమైన నేతలు, ఇప్పుడు పదవులు, ప్రాధాన్యతల కోసం వర్గాలుగా విడిపోయి పార్టీని అల్లకల్లోలం చేస్తున్నారు. తెలంగాణలో అధికారం రావడానికి ముఖ్యమైన ఉమ్మడి జిల్లాలలోనే పంచాయతీలు రావడంతో కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా గ్రూపుల యుద్ధం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గం, ఉప ముఖ్యమంత్రి భట్టి వర్గం మధ్య పొసగడం లేదనే టాక్ మొదటి నుంచి ఉంది. ఇప్పుడు ఆ విభేదాలు జిల్లాల వరకు పాకి పరిస్థితి మరింత జటిలమైంది. సీనియర్లను పక్కన పెట్టి తన వెంట వచ్చిన వారికే పదవులు ఇస్తున్నారనే ఆరోపణలు రేవంత్ పై గట్టిగా వినిపిస్తున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు కూడా రేవంత్ తో సరిగ్గా పడట్లేదని గాంధీభవన్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

**పాలమూరు జిల్లాలో 3 ముక్కలు**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మంత్రి జూపల్లి తనకు ప్రాధాన్యత లేదని అసంతృప్తిగా ఉన్నారు. వనపర్తిలో మేఘారెడ్డి, చిన్నారెడ్డి, శివసేన రెడ్డి గ్రూపులుగా పార్టీ విడిపోయింది. చిన్నారెడ్డి చేసిన ఆరోపణలు గాంధీభవన్ నుంచి ఏఐసీసీ వరకు వెళ్లాయి. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మంత్రి పదవి కోసం ఎదురుచూసి అలసిపోయారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డి అనుచరుడిగా ఉన్నారు.

**నల్గొండలో కోమటిరెడ్డి వర్సెస్ జానారెడ్డి వర్సెస్ ఉత్తమ్**

ఉమ్మడి నల్గొండలో కోమటిరెడ్డి బ్రదర్స్, జానారెడ్డి వర్గం, ఉత్తమ్ వర్గం, సుఖేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి వర్గాలుగా విడిపోయారు. ఇప్పటికే మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి తమ్ముడు రాజగోపాల్ రెడ్డి కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అంటూ ఆరోపణలు చేస్తున్నారు. రహస్య సమావేశాలు పెట్టారనే ప్రచారం కూడా ఉంది. కేటీఆర్ ఆయనను బిఆర్ఎస్ లోకి ఆహ్వానించినట్టు సమాచారం. మరోవైపు ఉత్తమ్ తన సతీమణి పద్మావతికి, జానారెడ్డి తన కుమారుడికి పదవులు కావాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

**వరంగల్, ఖమ్మం, ఇతర జిల్లాల్లోనూ గొడవలు**

వరంగల్ లో రేవూరి ప్రకాష్ రెడ్డికి మళ్లీ టికెట్ ప్రకటించడంతో కోండా మురళి, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి వర్గాల మధ్య వివాదం ముదిరి క్రమశిక్షణ కమిటీ నోటీసుల వరకు వెళ్లింది. ఖమ్మంలో భట్టి, పొంగులేటి తమదైన రాజకీయం చేస్తున్నారు. కరీంనగర్ లో పొన్నం, శ్రీధర్ బాబు, రంగారెడ్డిలో మంత్రులే లేరు. అదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ లో బిఆర్ఎస్ నుంచి వచ్చిన నేతలు తమకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని గుర్రుగా ఉన్నారు.

**పాత కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్**

వై.యస్ రాజశేఖర్ రెడ్డి అనుచరులకు ప్రాధాన్యత లేదని సీనియర్లు వాపోతున్నారు.పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారనే అసంతృప్తి పార్టీలో రోజురోజుకు పెరుగుతోంది. ఇన్ని వివాదాల నడుమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటన ముగించుకుని, అమెరికా టూర్ రద్దు చేసుకుని హైదరాబాద్ వస్తున్నారని సమాచారం. ఈ పంచాయతీ ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు కష్టమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధిష్టానం వెంటనే జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

# స్టేషన్ రికార్డులు పెండింగ్ లేకుండా చూసుకోవాలి

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**




సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :21(విజన్ ఆంధ్ర )వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ హద్నూర్ పిఎస్, జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హద్నూర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, డీఎస్పీ సైదా నాయక్ తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనపరచుకున్న లేదా కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు సంబంధిత ఆస్తులను కోర్టులో సబ్మిట్ చేసే వరకు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను (క్రైమ్ ప్రోన్ ఏరియాలు) బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, పగలు-రాత్రి బీట్ విధులలో నిఘా పెంచాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్-1 నుండి పార్ట్-5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కలిగి శాంతిభద్రతలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలు తెలిసి ఉండాలని, పగలు, రాత్రి బీట్ విధులలో తనిఖీ చేస్తూ, ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్‌డేట్ చేయాలన్నారు. పాపిలాన్ డివైస్ ను వినియోగిస్తూ, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేస్తూ, వేలిముద్రలను ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం కోసం ఎస్ హెచ్ ఓ సుజిత్ అవలంబిస్తున్న పనితీరు అభినందనీయం అన్నారు. అనంతరం జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసులు, అత్యాచార కేసులు, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా ప్రతి నెల తప్పనిసరిగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తూ, అనుమానిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలను గుర్తించి క చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ఇంజెనీరింగ్ లో లోపాలు ఉంటే ఎన్.హెచ్.ఎ తో మాట్లాడి మరమత్తుల దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల ఛేదనలో, నియంత్రణలో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. జహీరాబాద్ ప్రాంతం ఇతర రాష్ట్రాలతో సరిహద్దును కలిగి ఉండటం వలన అక్రమ రవాణ జరగానికి అవకాశం ఎక్కువ అని, రాష్ట్ర సరిహద్దులలో నిఘా కట్టుదిట్టం చేయాలని, నాకబంధి నిర్వహిస్తూ, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు సూచించడం జరిగింది. డిఎస్పీ కార్యాలయ, పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డ్ లను ప్రకటించారు. ఈ వార్షిక తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ వెంబడి జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు, టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి, సబ్ డివిజన్ ఎస్ఐ లు ఉన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

**- భూసేకరణ నిధుల విడుదలకు సీఎం ఆమోదం**
**- ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి**
**- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) ఆగస్టు 21 శుక్రవారం : క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించి, రైతులు భూ యజమానులతో సమన్వయం చేయాలి,కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్. రాష్ట్రంలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, పునరావాసం, అటవీ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, నీటిపారుదలశాఖల అధికారులను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసంపునరావాస పునరుద్ధరణ (=&=), పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు తదితర అంశాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఇ.శ్రీధర్ తో కలిసి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత చీఫ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చెన్నయ్య, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ విజయ్ భాస్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగాలంటే భూసేకరణ ప్రక్రియ పూర్తవడం అత్యంత ముఖ్యమన్నారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను



సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పెండింగ్ భూసేకరణను వేగవంతం చేసేందుకు నిధులను విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని మంత్రి వెల్లడించారు. అవసరమైన నిధులు అందుబాటులోకి వస్తున్నందున అధికారులు భూసేకరణ ప్రక్రియను ఇకపై మరింత వేగవంతం చేయాలని సూచించారు. నిధుల కొరత కారణంగా ఏ ప్రాజెక్టులోనూ భూసేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధులు విడుదలైన వెంటనే వాటిని నిర్దేశిత ప్రయోజనాలకు వినియోగించి అర్హులైన భూ యజమానులు, నిర్వాసిత కుటుంబాలకు చెల్లింపులు చేపట్టాలని సూచించారు. కొత్త ఆయకట్టు అభివృద్ధి చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల పనులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నందున, భూసేకరణ వంటి ప్రక్రియలు ప్రాజెక్టుల నిర్మాణానికి అడ్డంకిగా మారకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ప్రాజెక్టుల వారీగా పెండింగ్ భూసేకరణ కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భూసేకరణ అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, అటవీ శాఖకు సంబంధించిన అనుమతులు తదితర అంశాలను సమన్వయంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, సంబంధిత చీఫ్ ఇంజినీర్లు తమ పరిధిలోని ప్రతి నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ప్రాజెక్టు వారీగా, జిల్లా వారీగా సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. ఆర్థిక శాఖ నుంచి విడుదలైన నిధులు, జిల్లా కలెక్టర్ పీడీ ఖాతాలో జమ అయిన మొత్తం, ప్రస్తుతం పీడీ ఖాతాలో ఉన్న నిధులు, చెల్లింపుల కోసం విడుదల చేసిన మొత్తం, ఇప్పటివరకు భూ యజమానులు, భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసిత కుటుంబాలు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు చెల్లించిన పరిహారం తదితర వివరాలను సమగ్రంగా పర్యవేక్షించాలని తెలిపారు. ఇంకా చెల్లించాల్సిన పరిహారం ఎంత ఉంది, ఎంతమంది లబ్ధిదారులకు చెల్లింపులు జరగాల్సి ఉంది, చెల్లింపుల్లో జాప్యానికి కారణాలేమిటి, ఏ అంశాలు ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సి ఉంది అనే వివరాలను స్పష్టంగా గుర్తించాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ నాగర్‌కర్నూల్ నాగర్ కర్నూల్ జిల్లాలోని కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ , అచ్చంపేట ఎత్తిపోతల పథకం ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. భూసేకరణకు సంబంధించిన ప్రతి కేసును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ యజమానులు, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, నిబంధనల ప్రకారం పరిష్కరించగల అంశాలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియల్లో ఏదైనా సాంకేతిక, పరిపాలనా లేదా ఇతర సమస్యలు ఉంటే వాటిని గుర్తించి సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అవసరమైన చోట రెవెన్యూ, నీటిపారుదల, అటవీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయే రైతులు, భూ యజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం పరిహారం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అన్నారు. పరిహారం చెల్లింపులకు సంబంధించిన పత్రాలు, అవార్డులు, ఇతర ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు నిధులు అందేలా చూడాలని సూచించారు. అదేవిధంగా ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు పునరావాసం, పునరావాస పునరుద్ధరణ చర్యలను కూడా సమాంతరంగా చేపట్టాలని తెలిపారు. కేవలం భూసేకరణ పూర్తిచేయడమే కాకుండా, నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం నిర్దేశించిన పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా పెండింగ్ భూసేకరణ కేసులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన ప్రస్తుత స్థితి, పరిష్కరించాల్సిన అంశం, బాధ్యత వహిస్తున్న అధికారి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలను స్పష్టంగా నమోదు చేసుకుని పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులు భూసేకరణ కారణంగా నిలిచిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా భూసేకరణ సమస్య కారణంగా పనులు ప్రభావితమయ్యే అవకాశం ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలు ఒక్క శాఖ పరిధిలోనే పరిష్కారం కాకపోయే సందర్భాల్లో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల, అటవీ, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరించాలని తెలిపారు. ప్రాజెక్టుల పనులు పూర్తయితే రైతులకు సాగునీరు అందడంతో పాటు జిల్లాలో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున, భూసేకరణ మరియు పునరావాస ప్రక్రియల్లో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ భూసేకరణ కేసులు, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, అటవీ సంబంధిత అంశాలపై పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత కాలవ్యవధిలో సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దేవాలయ భూముల పరిరక్షణకు భక్తుల సంతకాల సేకరణ

***జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములను కాపాడేందుకు ఉద్యమం.. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపు***




జగద్గిరిగుట్ట, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర): జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయానికి చెందిన భూములు కబ్జాలకు గురికాకుండా పరిరక్షించాలనే సంకల్పంతో భక్తులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జగద్గిరిగుట్ట దేవాలయ భూముల పరిరక్షణ కమిటీ వెల్లడించింది. ఈ కార్యక్రమం శనివారం (22-08-2026) ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని కమిటీ తెలిపింది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతును సంతకం ద్వారా తెలియజేయాలని కోరింది. దేవాలయానికి సంబంధించిన భూములు భవిష్యత్ తరాలకు కూడా రక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కమిటీ పేర్కొంది. ఆలయ భూముల పరిరక్షణతో పాటు దేవాలయ పరిసరాల అభివృద్ధికి ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చింది.

పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయాలి

జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి గొప్ప పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు భక్తులు, ప్రజలు సహకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. దేవాలయ భూముల పరిరక్షణ విషయంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఆలయ ఆస్తులకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరింది. దేవాలయ భూముల పరిరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదని, ఇది భక్తులు, ప్రజలు, అధికారుల సమష్టి బాధ్యత అని కమిటీ పేర్కొంది. ఆలయ ఆస్తులను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ ఈ నిస్వార్థ దైవకార్యంలో భాగస్వాములు కావాలని కోరింది.

## పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

**- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**



నిజామాబాద్, ఆగస్టు 21 :( విజన్ ఆంధ్ర ) : రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాలమూరు మట్టి వాసన...
## “బోనం మీద బోనం“ తో దేశానికి చాటింది



పాటను విడుదల చేస్తున్న డైరెక్టర్ నాగ్ అశ్విన్....



ఐతోల్ గ్రామంలో పాటను చిత్రీకరించిన యూనిట్ సభ్యులు.... ఫైల్



పాటను తిలకిస్తున్న డైరెక్టర్....

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 21: ఉమ్మడి పాలమూరు నేల నుంచి ఒక కల ఎగిరొచ్చింది. నాగర్‌కర్నూల్ గడ్డపై పుట్టి పెరిగిన కొంతమంది యువకులు తమ చెమటను, కష్టాన్ని, తెలంగాణ సంస్కృతిపై ప్రేమను కలిపి “బోనం మీద బోనం“ అనే అద్భుత పాటను పుట్టించారు. శుక్రవారం ఆ కల హైదరాబాద్ ఫిలింనగర్‌లోని వైజయంతి మూవీస్‌లో నిజమైంది. ‘కల్కి‘ లాంటి మహా చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు నాగ్ అశ్విన్ స్వయంగా వచ్చి ఆ పాటను విడుదల చేసి, ఆ యువకుల భుజం తట్టారు. వేదికపై ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. “పట్టణాల్లో పుట్టినవాళ్లే సినిమాలు తీయాలనే రూల్ ని మీరు బద్దలు కొట్టారు. మీ కళలో, మీ డ్యాన్స్‌లో, మీ మాటల్లో మన బోనాల పండుగ ప్రాణం కనిపిస్తుంది. ఇది కేవలం పాట కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనం“ అని ఆయన మాట్లాడారు. “మీలాంటి వారికే కళామతల్లి దీవెనలు ఉంటాయి. రేపు మీరు నేషనల్ లెవెల్‌లో పేరు తెస్తారు, ఆ రోజు మొత్తం పాలమూరు గర్వంగా తలెత్తుకుంటుంది“ అని ఆశీర్వదించారు. శేఖర్ మాస్టర్ గొంతులో పలికిన ప్రతి పదం, సంపత్ పులి కళ్ళలో కనిపించిన కల, మణి కిషోర్ రాసిన ప్రతి అక్షరం, మోహన్ మిక్కీ ఇచ్చిన బీట్ అన్నీ కలిసి “బోనం మీద బోనం“ ను ఒక ఉద్యమంలా మార్చాయి. నాని పటేల్, బిట్టు డ్యాన్సర్ స్టెప్పులు చూస్తే ఒళ్ళు గగుర్పొడిచేలా ఉన్నాయి. ఇన్నాళ్లు సినిమా అంటే హైదరాబాద్, ముంబై అనుకున్నాం. కానీ ఈరోజు నాగర్‌కర్నూల్ నుంచి వచ్చిన బిడ్డలు ఆ భ్రమను పటాపంచలు చేశారు. గ్రామాల్లో కూడా టాలెంట్ ఉంటుంది, అవకాశం ఇస్తే సత్తా చూపిస్తారని నిరూపించారు. ఇది కేవలం ఒక పాట విడుదల కాదు అన్నా... ఇది పాలమూరు గడ్డకు వచ్చిన గౌరవం. ప్రతి తెలంగాణ బిడ్డా ఈ “బోనం మీద బోనం“ ను చూసి, షేర్ చేసి, మన యువకులకు అండగా నిలవాల్సిన సమయం ఇది...

## వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం



కాప్రా/ ఆగష్టు 21(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) నాచారం సర్కిల్ పరిధిలోని 19వ. డివిజన్ హెచ్.బి. కాలనీ ఇంద్రానగర్ చౌరస్తాలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు పీట్ల శ్రీధర్ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు వల్లెపు శివకుమార్ పిలుపు మేరకు ఉప్పల్ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు ఆలకుంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు ఆలకుంట శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో మా వడ్డెర కులాన్ని గుర్తించి దాల్వాయి రమాదేవి కి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి శాసనమండలిలో అవకాశం కల్పించి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయడానికి అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఇందిరానగర్ చౌరస్తాలో పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం కార్యవర్గ సభ్యులు జంబు రాజయ్య, శీను, అశోక్, నరసింహ, నాగరాజు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బి.సి. మహిళలకు ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్’ పథకం



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 21(విజన్ ఆంధ్ర)బి . సి .మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్’ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విష్ణు నందన్ తెలిపారు.

ఈ పథకం ద్వారా అర్హులైన బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించి, ఇంటి వద్దనే కుట్టుపని చేసుకుంటూ స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు. పథకానికి అర్హత కలిగిన బీసీ మహిళల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 13 వరకు కొనసాగుతుందని, అర్హులైన బీసీ మహిళలు నిర్దేశిత గడువులోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి, నిర్దేశిత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన బీసీ మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందడంతో పాటు కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని విష్ణు నందన్ కోరారు. పథకానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## కర్నాటక డిఫెన్స్ మద్యం సీజ్

హైదరాబాద్,ఆగస్ట్21 :నగరంలోని అమీర్‌పేట్‌లో కర్ణాటక డిఫెన్స్ లిక్కర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఆర్‌నగర్ ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద అనుమానాస్పదంగా మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తిని పోలీసులు గుర్తించారు. వెంటనే అతడిని తనిఖీ చేయగా.. తొలుత నాలుగు కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. విచారణలో గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి మద్యం తీసుకున్నట్లు సదరు వ్యక్తి వెల్లడించాడు. దీంతో వెంటనే గోవర్ధన్ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించగా.. దాదాపు 51 కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం 55 కర్ణాటక మద్యం బాటిళ్లను పోలీసులు సీజ్ చేశారు. కర్ణాటక నుంచి తక్కువ ధరకు డిఫెన్స్ మద్యం తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయాలు జరుపుతున్నట్లు విచారణలో బయటపడింది. ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 వరకు లాభం పొందుతున్నట్లు తేలింది. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు అమీర్‌పేట్ ఎక్సైజ్ సీఐ బానోత్ పటేల్ వెల్లడించారు.

## శ్రీశ్రీశ్రీ పూలాజీ బాబా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21,(విజన్ ఆంధ్ర) : ఈనెల 28, 29, 30 తేదీలలో జరగనున్న శ్రీశ్రీశ్రీ పూలాజీ బాబా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యురాలు కోవ లక్ష్మితో కలిసి ఉత్సవాల నిర్వహణపై గిరిజన సంక్షేమ, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, వైద్య, ఆర్.టి.సి. శాఖల అధికారులు, పూలాజీ బాబా ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జైనూర్ మండలం పట్నాపూర్ లోని పూలాజి బాబా సంస్థానంలో నిర్వహించే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జయంతి ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్ గడ్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యురాలు మాట్లాడుతూ జయంతి వేడుకలకు వచ్చే ప్రజల కొరకు పట్నాపూర్ కు వెళ్లే దారిలో రహదారి మరమ్మత్తులు పూర్తి చేయాలని, ఆర్.టి.సి. బస్సుల సౌకర్యం కొరకు ఆసిఫాబాద్, ఉట్నూర్ డిపో బస్సులు నడిపించాలని తెలిపారు. ఉత్సవాలు జరిగే 3 రోజులు నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, మిషన్ భగీరథ నీటి సరఫరా, వైద్య శిబిరాల నిర్వహణ అంశాలపై అధికారులు ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. ఉత్సవాలలో ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని, 30వ తేదీన భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం పూలాజి బాబా జయంతి ఉత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు అధికారులకు, శాసన సభ్యులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, డి.ఎస్.పి. అశోక్, విద్యుత్ ఎస్.ఈ. ఉత్తమ్, సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఇంగ్లే కేశవ్, నారాయణ, కైలాష్ పాల్గొన్నారు.

# బిజినపల్లిలో వరుస దొంగతనాల గుట్టురట్టు

**- కిలాడీ దొంగ అరెస్ట్.. భారీగా బంగారం, వెండి స్వాధీనం**




నాగర్‌కర్నూల్ క్రైమ్ విభాగం, ఆగస్టు 21: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ కిలాడీ దొంగను బిజినపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి భారీగా బంగారం, వెండి ఆభరణాలతో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బిజినపల్లి మండలం షాయినపల్లి గ్రామానికి చెందిన కసరి శివకుమార్ (23) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలు, మద్యానికి బానిసైన అతడు జల్సాలకు డబ్బులు సరిపోక చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పగటిపూట గ్రామంలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసేవాడు. ఎవరూ లేని సమయం చూసుకుని ఇనుప రాడ్‌తో తాళాలు పగలగొట్టి ఇంట్లోని బంగారం, వెండి, నగదును దొంగిలించేవాడు. ఈ క్రమంలో షాయినపల్లిలో ఐదు ఇళ్లు, మమ్మాయిపల్లిలో రెండు ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడ్డాడు. దొంగిలించిన సొత్తును తన తల్లికి తెలియకుండా ఇంట్లోని ఓ పెట్టెలో దాచిపెట్టాడు. బాధితుల ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. స్వాధీనం చేసుకున్న సొత్తు బంగారు ఆభరణాలు: 25.1 తులాలు వెండి ఆభరణాలు: 182 తులాలు ఇతర వస్తువులు: ఒక మొబైల్ ఫోన్ కేసును సమర్థవంతంగా ఛేదించిన బిజినపల్లి ఎస్సై ఎస్.కె. షంషుద్దీన్, సిబ్బంది భీముడు (పీసీ), రమేష్ (హెచ్‌జీ), శివ (హెచ్‌జీ)లను ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇరుగుపొరుగు వారికి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. ఇంట్లో విలువైన బంగారం, అధిక నగదు ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని తెలిపారు. నాణ్యమైన తాళాలతో పాటు సీసీ కెమెరాలు, సెన్సార్ లైట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. చోరీ జరిగినట్లయితే ఇంట్లోని వస్తువులను తాకకుండా, వేలిముద్రలు తదితర ఆధారాలు చెదిరిపోకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్.. డీసీఎం పార్కింగ్‌కు ప్రత్యామ్నాయ మార్గం!

**- రవాణా వాహనాల పార్కింగ్ సమస్యపై అధికారులతో ప్రత్యేక సమావేశం**

**- గాంధీనగర్‌లో డీసీఎం అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చర్చ**



జగద్గిరిగుట్ట, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర): రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, ఇరుకైన రహదారులు, పెరిగిపోతున్న వాహనాల రద్దీతో పారిశ్రామిక ప్రాంతాల్లో రవాణా వాహనాల పార్కింగ్ సమస్య తీవ్రంగా మారుతోందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా డీసీఎంల పార్కింగ్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 127రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్ ప్రధాన రహదారిలోని డీసీఎం అసోసియేషన్ పార్కింగ్ స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీఎం అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామిక వాడలోని వివిధ ప్రాంతాలకు వస్తువులను రవాణా చేసే డీసీఎంల సంఖ్య పెరుగుతుండటంతో పార్కింగ్ సమస్య మరింత జటిలమవుతోందని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాహనాలను రహదారులపై నిలిపివేయాల్సి రావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.. డీసీఎం అసోసియేషన్ పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తామని, సంబంధిత అధికారులతో త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గిరి ప్రసాద్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్, గాంధీనగర్ డీసీఎం అసోసియేషన్ అధ్యక్షుడు సమ్మయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జాఫర్, అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కట్టడిలో ప్రతిభ.. సీఐ వెంకటేశ్వర్లుకు గుడ్ వర్క్ రివార్డు




వీపనగండ్ల, ఆగస్టు 21 విజన్ ఆంధ్ర : డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లుకు పోలీస్ శాఖలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆయన ప్రతిభను గుర్తించిన ఉన్నతాధికారులు గుడ్ వర్క్ రివార్డుతో సత్కరించారు. హైదరాబాద్ యాంటీ డ్రగ్స్ విభాగం ఇన్‌చార్జి అడిషనల్ డీజీపీ సందీప్ శాండిల్య చేతుల మీదుగా సీఐ వెంకటేశ్వర్లు గుడ్ వర్క్ రివార్డు అందుకున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా పెంచి, వాటి నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టడంలో ఆయన చూపిన పనితీరును అధికారులు ప్రశంసించారు. పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు పెద్దమారూర్ గ్రామానికి చెందినవారు. డ్రగ్స్ నియంత్రణలో ఆయనకు లభించిన ఈ గుర్తింపు పట్ల ఉన్నతాధికారులు, సహచర పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరచి రివార్డు అందుకోవడం గర్వంగా ఉందని పెద్దమారూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ వెంకటేశ్వర్లును అభినందించారు.

# బంగారు తోరణాలతో మెరిసిన ఇళ్లు

**- ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం**

**- "ఇంటింటా లక్ష్మీదేవి కొలువు...**

**ఆడపడుచుల పూజలతో అలరారిన వీధులు"**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్టు 21:

శ్రావణ మాసం చివరి శుక్రవారం ఉమ్మడి పాలమూరు జిల్లా అంతటా భక్తి పరిమళాలు వెదజల్లాయి. మహిళలు, ఆడపడుచులు వరలక్ష్మీ వ్రతంను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఇంటింటా లక్ష్మీదేవి రూపాలు, బంగారు తోరణాలు, పసుపు కుంకుమల సందడితో వీధులన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజామునే నిద్రలేచిన మహిళలు ఇళ్లను శుభ్రం చేసి, ముగ్గులతో అలంకరించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, తాంబూలాలతో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. "ధన, ధాన్య, సౌభాగ్య, సంతాన లక్ష్మి" రూపాల్లో అమ్మవారిని కొలిచి, కుటుంబ సభ్యుల సుఖ సంతోషాల కోసం, భర్తల దీర్ఘాయుష్షు కోసం వ్రతం ఆచరించారు.

**పట్టణాల్లో, గ్రామాల్లో సందడి**

మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లోని ప్రధాన దేవాలయాలతో పాటు ఇళ్లలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ ఆలయం, వనపర్తి శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో,నాగర్ కర్నూల్ సరస్వతి దేవి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆడపడుచులు కొత్త చీరలు ధరించి, చేతులకు మెహందీ పెట్టుకుని, బంధుమిత్రులతో కలిసి వ్రతం చేసి తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నారు. చిన్నారులు అమ్మవారి ముందు దీపాలు వెలిగించి, భజనలు చేయడం ఆకట్టుకుంది. చాలా ఇళ్లలో "అష్టోత్తర శతనామావళి"తో అర్చనలు చేసి, పులిహోర, పాయసం, అరిసెలు నైవేద్యంగా సమర్పించారు.



వాయనం తీసుకుంటున్న మహిళలు....

**సామాజిక సౌభ్రాతృత్వానికి ప్రతీక**

వరలక్ష్మీ వ్రతం కేవలం పూజనే కాదు, మహిళల మధ్య అనుబంధాలను పెంచే పండుగగా నిలిచింది. పొరుగు మహిళలు ఒకరింటి నుంచి మరొక ఇంటికి వెళ్లి తాంబూలం తీసుకుని ఆశీర్వాదాలు అందుకున్నారు. ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుంటిన్నమ్మ వాయనం అంటూ తాంబూలం తీసుకున్నారు. వృద్ధ మహిళలకు చీరలు, రవికల గుడ్డలు దానం చేయడం ఆనవాయితీగా కొనసాగింది. ఉద్యోగస్తులైన మహిళలు కూడా ఆఫీసుల్లో చిన్న పూజలు చేసి, సాయంత్రం ఇంటికి చేరుకుని కుటుంబంతో కలిసి వ్రతం పూర్తి చేశారు. సాయంత్రం వరకు ఇళ్లలో భజనలు, కోలాటాలు, లక్ష్మీ స్తోత్రాలతో వాతావరణం భక్తిమయంగా మారింది. పూజ అనంతరం మహిళలు "అమ్మవారు అందరి ఇళ్లలోనూ సిరి సంపదలు కురిపించాలని, రైతులు, కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని" ప్రార్థించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతం సందడి రాత్రి వరకు కొనసాగింది. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇల్లూ వెలుగులు నింపుకుంది.



వరలక్ష్మి పూజ అనంతరం అమ్మవారి రూపం....

# కొల్లాపూర్ ఆర్డీఓ ,, పెంట్లవెల్లి రెవెన్యూ అధికారులపై మంత్రి జూపల్లి ఆగ్రహం!

**- పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ**

**- ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల మంజూరులో ఓసీలతో పాటు మైనార్టీలో ఉండే ఓసీలకే మంజూరు చేయండి!**

**- ప్రజలతో లంచం తీసుకున్నట్లు ఆరోపణ వస్తే చర్యలు తప్పవు**

**- పైసల కోసం ఫైళ్లను పెండింగ్లో ఉంచితే రంగంలోనికి నేనే దిగుతాను, అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన మంత్రి జూపల్లి!**

కొల్లాపూర్/పెంట్లవెల్లి, ఆగస్ట్ 21 (విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించిన మంత్రి జూపల్లి ,అనంతరం పెంట్లవెల్లి తహసీల్దార్ కార్యాలయం లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొదట కార్యాలయ రికార్డులు, సమయపాలన హాజరు శాతం రికార్డు అంశాలను పరిశీలించిన ఆయన, కొందరు రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం కార్యాలయంలో ఉన్న పెండింగ్ ఫైల్స్ ను పరిశీలించారు, వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్నందుకు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.తహసీల్దార్ భాస్కర్ ఛాంబర్ పక్కన ఉన్న బాత్రూం ను పరిశీలించిన మంత్రి దుర్వాసనతో మురికిగా ఉన్న బాత్రూంను చూసి మంత్రి జూపల్లి స్వయంగా జగ్గు ద్వారా నీళ్లు బాత్రూంలో చల్లి, క్లీన్ చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు. కార్యాలయ పరిశుభ్రత బాత్రూంలో ఉండాల్సిన అవసరమైన సామగ్రి లేదన్న సంగతి తెలుసుకొని ఆయన తన సొంత డబ్బులతో బకెట్, జగ్గు బ్రష్, ఫినాయిల్ ,ఆర్ పిక్ లను కొనుగోలు చేయించి తెప్పించి బాత్రూంలో ఉంచారు. అడుగు భాగంలో పకర పట్టి అపరిశుభ్రంగా ఉన్న బాత్రూం టైల్స్ మార్పులకు తన సొంత రెండు వేల రూపాయల్ని కార్యాలయం సిబ్బందికి ఇచ్చారు. తక్షణమే బాత్రూంలో టైల్స్ మార్పిడి వసతులు సరిగా ఉండే విధంగా చూసుకోవాలని తహసిల్దార్ భాస్కర్కు ఆదేశించారు. అనంతరం ఆఫీసులో పెండింగ్లో ఉన్న ఈ డబ్ల్యూ ఎస్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల కోసం పెండింగ్ ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించిన జూపల్లి, పెండింగ్ లో ఉన్న జటప్రోలు గ్రామానికి చెందిన తూముకుంట రాఘవరెడ్డి కూతురు కల్యాణ లక్ష్మి దరఖాస్తు అంశాన్ని పునఃపరిశీలించి జటప్రోలు రాఘవ రెడ్డికి మంత్రి జూపల్లి స్వయంగా ఫోన్ చేసి అధైర్య పడొద్దు అని తక్షణమే మీ కళ్యాణ్ లక్ష్మి చెక్కు తప్పకుండా అందిస్తామని మాటిచ్చారు.వెంటనే అతని దరఖాస్తును పైకి పంపించి ఆయన కుటుంబానికి చెక్కు ఇవ్వాలని పెంట్లవెల్లి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే కొండూరు రైతుకి సంబంధించిన భూమి సమస్య విషయంలో కొల్లాపూర్ ఆర్డిఓ బన్సీలాల్ కు మంత్రి ఫోన్ చేసి పెంట్లవెల్లికి పిలిపించుకొని ఆ రైతు



ను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ సమస్య ఎందుకు నీరుగారిస్తున్నారని ఆర్డీవో పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లాపూర్ నుండి పెంట్లవెల్లి కి పట్టుమని 10 కిలోమీటర్ల దూరం ఉంది అని ఎందుకు తాసిల్దార్ కార్యాలయానికి రాలేకపోతున్నామని ఆర్డీవోను నిలదీసి గట్టిపట్టి సూచనలు ఇచ్చారు. కింది సిబ్బందిపై శోకస్ నోటీలు జారీ చేస్తా అంటున్న ఆర్డిఓ వు మరి నీకు ఏ నోటీసు జారీ చేయాలి అని ముందు సమస్యకు పరిష్కారం వెతకాలి తప్ప కిందిస్థాయి రెవెన్యూ సిబ్బందిని ఇబ్బందుల గురి చేయొద్దని ఆర్డీవోకు హెచ్చరించారు.కొల్లాపూర్ నియోజక వర్గంలో ఉండే ఏడు మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ రెవెన్యూ, మండల పరిషత్ ,పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి దరఖాస్తు, ఫిర్యాదులకు రిసీవ్డ్ తో పాటు స్టాంప్, సంతకం వేసి ఇవ్వాలని, ఆ సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఎవరైనా ప్రభుత్వాధికారులు ప్రజలతో లంచం తీసుకున్నట్లు తన దృష్టికి వస్తే వాళ్లపై పోలీస్ కేసులు నమోదు చేయిస్తానని, అలాగే సస్పెండ్ చేయించడం జరుగుతుందని ఆయన లంచగొండి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి తో పాటు ఆర్డిఓ తహసిల్దార్ సిఐ ఎస్ఐ పెంట్లవెల్లి రెవెన్యూ అధికారులు, మండల గ్రామ ప్రజా ప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మానోపాడ్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ..

**- సేవాభావంతో ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు బలం**

**- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**




గద్వాల ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారశీ మానోపాడ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, పోలీసుల సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మెన్ యూనిఫామ్ టర్న్ ఔట్, కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తనిఖీ చేశారు. పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా భావం, చట్ట పరిరక్షణ అధికారాల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మానోపాడు పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారెక్స్, స్టేషన్ రికార్డుల మెయింటేనెన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ,కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న/ కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్స్ లు గా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. రిసెప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన ఉండాలని, గ్రామ పెద్దలతో, యువతతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. స్టేషన్ పరిధిలో గల రౌడీ, సస్పెక్ట్, హిస్టరీ షీటర్లను చెక్ చేస్తూ ఆన్లైన్ రికార్డులో నమోదు చేయాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారి షీట్స్ ను సంబంధిత ప్రాంతాలలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ లకు పంపాలని తెలిపారు.అలాగే పాపిలోన్ డివైస్ ను వినియోగించి అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను చెక్ చేస్తూ, పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపు, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. స్టేషన్ రికార్డులైన ఎస్.సి.ఎచ్. పార్ట్ 1 5, జనరల్ డైరీ, ఎఫ్.ఐ.ఆర్. ఇండెక్స్, ఆల్ఫాబీటికల్ ఇండెక్స్, డ్యూటీ రోస్టర్, విస్టింగ్ నోట్ బుక్స్, రౌడీ, సస్పెక్ట్ షీట్స్, గన్ లైసెన్స్ రిజిస్టర్, ఎల్.ఎల్.ఐ., గవర్నమెంట్ ప్రాపర్టీ రిజిస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, మొదలగున్నవి చెక్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్సై కి సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది తో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడుతూ బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డయల్ – 100/112 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ – 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్–కాప్, ఈ–సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉన్నాయి. ఇట్టి అప్లికేషన్ల పై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించడం జరిగింది.ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ, డిఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ,సిఐ,ఎస్సై లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గురువు మందలింపునకు గౌరవం ఏదీ?

**విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి..**

**రూపారెడ్డి మృతి పునరావృతం కాకూడదు: ట్రస్మా**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల చేతిలో దారుణ హత్యకు గురైన ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతికి తెలంగాణ గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రపస) గ్రేటర్ కుత్బుల్లాపూర్ కమిటీ ఘనంగా నివాళులర్పించింది. శుక్రవారం సాయంత్రం రంగారెడ్డి నగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాల ఆవరణలో రూపారెడ్డి చిత్రపటానికి కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.(ఈ సందర్భంగా ట్రస్మా అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులపై ఈ స్థాయిలో దారుణానికి పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగించే అంశమన్నారు. ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

**పిల్లల పెంపకంలో తల్లిదండ్రులదే కీలక బాధ్యత**

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని రామేశ్వర్‌రెడ్డి సూచించారు. తల్లిదండ్రుల నియంత్రణ, పర్యవేక్షణ లోపించడం వల్ల కూడా విద్యార్థులు చెడు మార్గాల్లోకి వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాలల్లో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే స్థాయిలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై బాధ్యతాయుతంగా దృష్టి సారించాలని కోరారు.

**మందలించే హక్కు ఉపాధ్యాయులకు ఉండాలి**

విద్యార్థులు తప్పుదోవ పడుతున్నప్పుడు వారిని మందలించి, క్రమశిక్షణలో పెట్టే హక్కు ఉపాధ్యాయులకు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని రామేశ్వర్‌రెడ్డి అన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు విద్యార్థిని మందలించినా, క్రమశిక్షణ కోసం చర్య తీసుకున్నా కొందరు తల్లిదండ్రులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులతో అమానుషంగా ప్రవర్తిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, వివిధ సంఘాల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం వల్ల విద్యార్థుల్లో ఉపాధ్యాయుల పట్ల గౌరవం తగ్గిపోతోందన్నారు. సమాజంలో ఉపాధ్యాయుడికి తగిన గౌరవం లభించినప్పుడే విద్యార్థులు క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.




**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి**

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేలా ప్రభుత్వం మరింత కఠిన చర్యలు చేపట్టాలని రామేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల ప్రభావం విద్యార్థులపై పడకుండా పాఠశాలలు, తల్లిదండ్రులు, పోలీసులు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో రూపారెడ్డి వంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించేందుకు తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు కలిసి పనిచేయాలని సూచించారు.

**ట్రపస నాయకుల నివాళి**

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బిర్రు ఆంజనేయులు, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గడ్డమీది బాలరాజు, నర్సింహులు, సీహెచ్ నర్సింహాగౌడ్, వీరన్న, మండల సంఘం నాయకులు కోలా వెంకటేష్, వినోద్ జాదవ్, దయాకర్, జనార్దన్, శ్రీశైలం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారెడ్డిపై ఖర్గేకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు

**- పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఏఐసీసీ అధ్యక్షుడికి వినతి**

**- విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని ఖర్గే స్పష్టీకరణ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో వనపర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ, మండల అధ్యక్షులతో కలిసి ఆయన ప్రత్యక్షంగా కలిసి వినతిపత్రం అందించారు. కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా చిన్నారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీ-ఫారమ్‌లను డబ్బులకు అమ్ముకుందంటూ చిన్నారెడ్డి చేసిన ఆరోపణలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన చిన్నారెడ్డిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి కోరారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సానుకూలంగా స్పందించారని మేఘారెడ్డి తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఖర్గే హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు మరియు పార్టీ ముఖ్య శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డిమాండ్లకై రోడ్డెక్కిన ఆటో చక్రం..!!

**- కలెక్టరేట్ ముట్టడితో గళమెత్తిన కార్మిక లోకం**

**- బతుకు బండి లాగలేక పోరుబాట**

**- గోదావరిఖనిలో ఆటో కార్మికుల మహా గర్జన**

**- ఎన్నికల వేళ వరాలు.. గద్దెనెక్కాక మొండిచేయి**

**- బీఆర్ఎస్ నేత వ్యాల్ల హరీష్ రెడ్డి ధ్వజం**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర): తెల్లవారితే చాలు... కుటుంబానికి నాలుగు వేళ్లు లోపలికి వెళ్లాలంటే ఆ మూడు చక్రాలే వారికి ఆధారం. ఎండనక, వాననక రోడ్లపై తిరుగుతూ నిత్యం ప్రజలను గమ్యస్థానాలకు చేర్చే ఆటో కార్మికుల జీవితాలు నేడు తీరని గందరగోళంలో పడ్డాయి. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నీటిమీద రాతలుగానే మిగిలిపోవడంతో, బతుకు బండిని లాగలేక అలసిపోయిన కార్మికులు శుక్రవారం కదం తొక్కారు. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం 'తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ' పిలుపు మేరకు నిర్వహించిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమంతో పెద్దపల్లి జిల్లా దద్దరిల్లింది.

ర్యాలీగా కదిలిన ఆటో కార్మిక సైన్యం!!

గోదావరిఖని ప్రధాన చౌరస్తా వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జేఏసీ పెద్దపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు వ్యాల్ల హరీష్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ సంయుక్తంగా జెండా ఊపి ఆటోల మహా ర్యాలీని ప్రారంభించారు. వందలాది ఆటోలతో సాగిన ఈ నిరసన ప్రదర్శన కలెక్టరేట్ వైపు ఉప్పెనలా సాగింది. ఈ సందర్భంగా వ్యాల్ల హరీష్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. "గత ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రతి డ్రైవర్‌కు ఏటా రూ.12 వేల జీవనభృతి



అందిస్తామని, ప్రతి ప్రాంతంలో ఆటోనగర్లను తీర్చిదిద్దుతామని ఎన్నో ఆశలు చూపి అధికారం చేపట్టింది. కానీ గద్దెనెక్కిన తర్వాత ఆ వాగ్దానాలను గాలికొదిలేసింది" అని మండిపడ్డారు. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం అమలులోకి వచ్చాక ఆటోలకు గిరాకీలు లేక డ్రైవర్లు పస్తులుండే దుస్థితి వచ్చిందని, నెలసరి ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్‌కు దిగుతామని తేల్చిచెప్పారు. ర్యాలీ అనంతరం కార్మికుల బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించింది.

కార్మికుల ప్రధాన డిమాండ్లు!!

ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.1,000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు. ఇచ్చిన హామీ ప్రకారం రూ.12 వేల వార్షిక జీవనభృతి అమలు. 50 ఏళ్లు నిండిన ఆటో కార్మికులకు నెలకు రూ.10,000 గౌరవ పెన్షన్. అక్రమంగా నడుస్తున్న టూ వీలర్ బైక్ ట్యాక్సీలపై తక్షణ నిషేధం.

అధిక ఇన్సూరెన్స్ ప్రీమియంల తగ్గింపు, ప్రభుత్వమే పూర్తిస్థాయి





భీమా కల్పించడం.

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వేధింపుల నియంత్రణ, ఆటోలకు స్టేట్ పర్మిట్ మంజూరు.

రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద అధికారిక ఆటో స్టాండ్లు, ఇళ్లు లేని డ్రైవర్లకు పక్కా ఇళ్ల నిర్మాణం.

ఆటో రంగాన్ని ప్రత్యేక పరిశ్రమగా అధికారికంగా గుర్తించడం.

ఈ నిరసన పోరుబాటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణలతో పాటు ఆటో జేఏసీ నేతలు బురహాన్, జబ్బర్, కడార్ల శ్రీధర్, అన్ను బాయ్, చొప్పరి శ్రీనివాస్, రంగు దుర్గ ప్రసాద్, కే.వి. చందు, అనిల్ రావు, సార్ల ఉదయ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వనపర్తిలో ఆగస్టు 30 నుంచి అయుత చండీ, అతిరుద్ర మహాయాగాలు

**- శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21(విజన్ ఆంధ్ర) : విశ్వశాంతి, లోక కల్యాణం కోసం వనపర్తి జిల్లా కేంద్రంలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 13 వరకు 15 రోజుల పాటు అయుత చండీ, అతిరుద్ర మహాయాగాలు వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ కృష్ణ కాలచక్రం ఆధ్వర్యంలో మర్రికుంట పాలకేంద్రం వెనుక ఈ 92వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు జరగనున్నాయి. పురుష సూక్త పూర్వక మహాగణపతి, మహాసుదర్శన, లక్ష్మీనారాయణ సహిత శ్రీమద్భాగవత పారాయణంతో పాటు శ్రీసీతారామ సామూహిక పీఠాభిషేకం, వివిధ హోమాలు నిర్వహిస్తారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రకృతి వైపరీత్యాలు తొలగి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బాల్యవివాహాల నిర్మూలన, మహిళా సాధికారత, సమాజంలో ధర్మ పరిరక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేపడతారు. ఈ మహోత్సవంలో ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

# ఎత్తైన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్టించడం చారిత్రాత్మకం

**- ఖిల్లా రామాలయ ఆవరణలో భూమి పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్....**



నిజామాబాద్ ఆగస్టు21:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ శుక్రవారం రోజు చారిత్రాత్మకమైన ఖిల్లా రామాలయంలో ఎత్తయిన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్టించడం చారిత్రాత్మకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర కూట రాజులు నిర్మించి, చత్రపతి శివాజీ మహారాజ్ గురువు సమర్థ రామదాసు అభివృద్ధి చేసిన ఖిల్లా రామాలయంలో 101 అడుగుల ధర్మ ధ్వజాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ధర్మ కార్యానికి హిందువులంతా ఏకమవ్వాలన్నారు. నగరవాసులందరికీ కనపడేలా ఎత్తైన ధ్వజాన్ని ప్రతిష్టించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గురుప్రసాద్, కార్యదర్శి మారయ్య గౌడ్, మాజీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, కోశాధికారి వాసు, గంట లింగం, హిందూ సంస్థల ప్రతినిధులు నరేష్, ప్రవీణ్, సూరి, సంతోష్, సాయిరాం, సాయి, సందీప్, బీజేపీ కార్పొరేటర్లు, వీహెచ్ పీ, భజరంగ్ దళ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నుంచి ఢిల్లీకి సోను యాదవ్ సైకిల్ యాత్ర

**- జెండా ఊపి ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోను యాదవ్ చేపట్టిన సైకిల్ యాత్రను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ నుంచి ఢిల్లీ వరకు సుమారు మూడు నెలల పాటు సాగే ఈ యాత్ర తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ మీదుగా కొనసాగనుంది. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, లక్ష్య సాధన కోసం సుదీర్ఘ సైకిల్ యాత్ర చేపట్టిన సోను యాదవ్‌ను అభినందించారు. యాత్ర విజయవంతంగా పూర్తిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేడ్చల్‌మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**- వనపర్తిలో బీజేవైఎం ధర్నా..**

**- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**







వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో ధర్నా నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ్ అధ్యక్షత వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "క్రిమినల్ పనులు చేసే రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడు.. అందుకే విద్యార్థులను క్రిమినల్స్ అంటున్నాడు" అని ధ్వజమెత్తారు. తాను వనపర్తి జిల్లా కేంద్రంలోనే జన్మించి విద్యాభ్యాసం చేశానని, విద్యార్థుల సమస్యలు తనకు ప్రత్యక్షంగా తెలుసని అన్నారు. విద్యార్థులను అవమానించేలా మాట్లాడటం సరికాదని, వారి సమస్యలను పరిష్కరించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ (టీఆర్ఎస్) హయాంలో విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యాసంస్థల నుంచి సర్టిఫికెట్లు పొందలేక ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అందే బాబయ్య, సబిరెడ్డి వెంకట్రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంటంపల్లి పురుషోత్తం రెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, కల్పన, సీనియర్ నాయకులు బండారు కుమారస్వామి, శివారెడ్డి, కృష్ణ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, కౌన్సిలర్ విజయ్, సీతారాములు, చిత్తారి ప్రభాకర్, నక్క మహేష్, బీజేవైఎం నాయకుడు కదిరి మధు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాసులు, పలువురు నాయకులు మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు నిజామాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన

**- ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



నిజామాబాద్, ఆగస్టు 21 :(విజన్ ఆంధ్ర )తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నిజామాబాద్ లో పర్యటించనున్నారు. ఉదయం 7.00 గంటలకు నాగారంలోని నిర్మితి కేంద్రం వద్ద హౌసింగ్ టవర్స్ నిర్మాణం కోసం స్థల పరిశీలన జరపనున్నారు. అనంతరం 43వ డివిజన్ పాములబస్తిలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి, లబ్దిదారులతో భేటీ కానున్నారు. ఉదయం 10.00 గంటలకు రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు పత్రాలను పంపిణీ చేయనున్నారు. అక్కడి నుండి గూపన్ పల్లికి చేరుకొని తహసిల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అదేవిధంగా దుబ్బ ప్రాంతంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)కు చేరుకుని హౌసింగ్, రెవెన్యూ అంశాలపై నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అంతకుముందు మంత్రి పర్యటించనున్న ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు,ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్ తదితరులు ఉన్నారు.

# బోడుప్పల్ శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ అమ్మవారికి ముక్కుపుడక సమర్పించిన మాజీ కార్పొరేటర్ దంపతులు రాసాల మంజుల వెంకటేష్ యాదవ్

**- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**

**అమ్మవారి ఆశీస్సులు పొందిన కుటుంబ సభ్యులు**

**- పాల్గొన్న నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు**






బోడుప్పల్,ఆగస్ట్21(విజన్ ఆంధ్ర) : శ్రావణ శుక్రవారం సంధర్భంగా బోడుప్పల్ లోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో మాజీ కార్పొరేటర్ దంపతులు రాసాల మంజుల వెంకటేష్ యాదవ్ కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ముక్కుపుడకను సమర్పించారు. సంప్రదాయబద్ధంగా ఆలయానికి చేరుకున్న దంపతులతో పాటు నాయకులు, ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ముక్కుపుడకను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారికి ముక్కుపుడక సమర్పణ కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. ఆలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దంపతులు రాసాల మంజుల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ బంగారు మైసమ్మ అమ్మవారిపై తమకు ఉన్న భక్తి, విశ్వాసంతోనే ముక్కుపుడకను సమర్పించినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాసాల సుస్మీత ఫృద్వీ యాదవ్,రాసాల మౌనిక శ్రీనివాస్ యాదవ్,మాజీ కార్పోరేటర్ బింగి జంగయ్య యాదవ్,రాసాల నర్సింగ్ రావు యాదవ్,రాసాల బాల మల్లేష్ యాదవ్,రాసాల శ్రీసైలం యాదవ్,రాసాల సత్యనారాయణ యాదవ్,రాసాల రమేష్ యాదవ్,ఆలయ కమిటి చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి,ఆలయ కమిటి సభ్యులు దేవరకొండ వీరాచారి,సామల జయేందర్ రెడ్డి,జనిగె బంగారు యాదవ్,జనిగె అంజనేయులు యాదవ్,కొండా రాంచందర్ యాదవ్,రాపోలు శంకరయ్య,మన్నె ప్రభాకర్ రెడ్డి,యర్రగుండ్ల సత్యమూర్తి యాదవ్,కొత్త కిరణ్ గౌడ్,శ్రీరాముల జ్ఞానేశ్వర్ ,పన్నాల జనార్ధన్ రెడ్డి,భక్తులు,స్థానికులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

# అప్పులో కొత్తకోట మున్సిపల్ కిరాయి భవనం ?


**- కొత్త మున్సిపల్ కార్యాలయంకు మోక్షం ఎప్పుడు**



కొత్తకోట ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట: కిరాయి భవనంలో కొనసాగుతున్న కొత్తకోట మున్సిపల్ కార్యాలయంకు 13 లక్షలు దాకా అప్పుల్లో ఉందని కొత్తగా నిర్మాణం చేపడతామన్న మున్సిపల్ కార్యానికి మోక్షం ఎప్పుడు లభిస్తుందని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు కొత్తకోట పట్టణంలోని ఆర్ అండ్ బి ఆవరణలో కొనసాగిన సమీలికృత కాంప్లెక్స్ రెండు కోట్ల రూపాయలతో గత ప్రభుత్వం ప్రారంభించి పనులు పూర్తి చేయకపోవడంతో మిగిలిపోయిన పిల్లర్స్ దగ్గర పరిశీలించడం జరిగింది ఇదే స్థలంలో మున్సిపల్ కార్యాలయం కొరకు శంకుస్థాపన చేశారు నాలుగు నెలలు కావస్తున్న పనులు చేపట్టకపోవడం మరి దారుణమని ఆయన ఆరోపించారు పాత గ్రామపంచాయతీ భవనం ద్వారా ప్రతినెల 30 వేల పైగా ఆదాయం వచ్చేదని ఆ భవనాన్ని నేలమట్టం చేయడం ద్వారా వచ్చే ఆదాయంకు గండి పడిందని ఆరోపించారు దీూచీూ కార్యాలయంలో కొనసాగుతున్న మున్సిపల్ కార్యానికి నెలకు 32 వేల రూపాయలు కిరాయి చెల్లిస్తున్నారు ఈ విధంగా మొత్తం నెలకు 70 వేలు ఆదాయము మున్సిపాలిటీకి నష్టం కలుగుతుంది అదేవిధంగా ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు కూడా లేవు వయస్సు పైబడిన వారు మున్సిపల్ భవనం ఆఫీస్ పైకి మెట్లు ఎక్కలేక పోతున్నారు అదేవిధంగా నాలుగు సంవత్సరాల నాలుగు నెలల దీూచీూ ఆఫీస్ కు మున్సిపల్ కార్యాలయం ద్వారా 13 లక్షలు కిరాయి బకాయి ఉన్నట్లు తెలుస్తుంది వెంటనే పాలకులు కొత్త మున్సిపల్ కార్యానికి నిర్మాణ పనులు చేపట్టి కొత్తకోటకు ఆదర్శంగా నిలవాలని కోరుచున్నాను ముందుభాగంలో కొన్ని షాపులు నిర్మిస్తే ఆదాయం కూడా సమకూర్చుకోవచ్చని చౌరస్తాలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ పైన కొత్తగ షాపులు నిర్మిస్తే ఆదాయం కూడా వస్తుందని ఆయన చెప్పారు వీటితో పాటు సిబ్బందిని కూడా పెంచుకోవడానికి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి అదేవిధంగా మున్సిపల్ కాంప్లెక్స్ షాపులకు కిరాయి డబ్బులు తగ్గించాలని డిమాండ్ చేశారు

# నీట్ (పీజీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**




నిజామాబాద్, ఆగస్టు 21 :(విజన్ ఆంధ్ర )ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్(పి.జీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ఈ నెల 30న జరుగనున్న నీట్ (పీజీ)-2026 పరీక్షను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిలాలో నీట్(పి.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అర్సపల్లిలోని ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ లో 175 మంది, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్ సెంటర్ లో 90 మంది పరీక్షకు హాజరవుతారని కలెక్టర్ వివరించారు. ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కాగా, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని నీట్(పి.జీ) పరీక్ష నిర్వహణలోనూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# తీర్యాని మండలంలో ఐటీడీఏ పీవో మంద మకరందు విస్తృత పర్యటన.

**- ఉపాధ్యాయునిగా మారి 20నిముషాలపాటు విద్యార్థుల కు పాఠాలు చెప్పిన ప్రాజెక్టు అధికారి.**
**- ఆశ్రమ పాఠశాలలు , గ్రామీణ సమస్యలపై ప్రత్యేక దృష్టి.**

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21:(విజన్ ఆంధ్ర) కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తీర్యాని మండలంలోని పలు గ్రామాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విస్తృతంగా పర్యటించి విద్య, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు,పర్యటనలో భాగంగా తొలుత పంగిడి మాదొర ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని, విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల లో తాగునిరు సమస్య, వంటగది ని పరిశీలించి పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, ఇతర సౌకర్యాలపై కూడా వివరాలు తెలుసుకున్నారు.అనంతరం పంగిడి మాదొర రైతు



వేదికలో సర్పంచులు ఆత్రం రాధాబాయి, తుంరం గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఐటీడీఏ పీవో పాల్గొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పారిశుధ్యం, తాగునీరు, ప్రజారోగ్యం తదితర అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తదనంతరం పీవీటీజీ గ్రామమైన దంతన్‌పల్లిలో పర్యటించిన ఐటీడీఏ పీవో, అక్కడ ఆశ్రమ పాఠశాల పునఃప్రారంభానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. పాఠశాల భవనం, స్థల పరిస్థితులను స్వయంగా పరిశీలించి, గిరిజన విద్యార్థులకు విద్యా సౌకర్యాలు మరింత చేరువయ్యేలా సాధ్యమైనంత త్వరగా దంతన్‌పల్లిలో ఆశ్రమ పాఠశాల పునఃప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్, ఏ టీ డి ఓ చిరంజీవి పాఠశాల సిబ్బంది,మాజీ మండల అధ్యక్షులు ఆత్రం లక్ష్మణ్, గ్రామ పటేల్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 కోట్లకు పైగా మోసం చేశారంటూ ఆరోపణలు..

**- జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితులు**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి విజన్ ఆంధ్ర : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భారీగా డబ్బుల మోసం జరిగిందంటూ పలువురు బాధితులు జిల్లా ఎస్పీ నీతికా పంత్ ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు ప్రకారం.. ఆసిఫాబాద్ పట్టణంలో రిపోర్టర్‌గా పనిచేస్తున్న షేక్ ఖలీల్ అహ్మద్ అనే వ్యక్తి వద్ద 40 నుంచి 50 మంది వరకు నేల నేల చిట్టీలు వేసి వివిధ సందర్భాల్లో డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం రూ.2 కోట్లకు పైగా డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించకుండా మోసం చేశారని బాధితులు ఆరోపించారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా స్పందించకపోవడంతో చివరకు జిల్లా ఎస్పీని ఆశ్రయించినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు బాధితులు ఈరోజు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతికా పంత్ ను కలిసి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయడంతో పాటు, డబ్బులు తీసుకున్న వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంద్రే విశాల్, నజీర్, ఆకుల సంతోష్ ఎం రాజు, అంజలి, రాపర్తి నాగరాజ్ రాపర్తి శ్రావణ్.తదితరులు ఉన్నారు.

## 'బడి మొగ్గలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ఆగస్టు 21 విజన్ ఆంధ్ర ప్రతినిధి : పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి డా. భీంపల్లి శ్రీకాంత్ రచించిన 'బడి మొగ్గలు' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే పాఠశాలల గురించి, ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి రచయిత పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమన్నార. ఇది ఉపాధ్యాయ వృత్తి పట్ల రచయితకు ఉన్న గౌరవభావాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి రచనలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డా. ఐ. విజయకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే విధంగా 'బడి మొగ్గలు' పుస్తకం రూపుదిద్దుకుందని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పాఠశాలలను, విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, జి.సి.డి.ఓ అస్రాఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేయాలి



మహబూబ్ నగర్ ఆగస్టు 21 విజన్ ఆంధ్ర ప్రతినిధి :నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణ , పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఇంజనీరింగ్ ,రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇదే విషయమై రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. వి.సి సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ భూసేకరణకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో మాట్లాడి పరిష్కరించాలని చెప్పారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.1000, న్యూట్రిషన్ కిట్లు అందజేయాలి

**- జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవితేజ**



ములుగు ఆగస్టు 21: విజన్ ఆంధ్ర ప్రతినిధి : టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ తో పాటు డైరెక్ట్ బెనిఫిషరీ స్కీం కింద నెలకు రూ.1000 చొప్పున అందరికీ అందజేయాలని జిల్లా టీబీ నియంత్రణ ప్రోగ్రాం అధికారి బిడాక్టర్ రవితేజబి తెలిపారు. గురువారం ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జీజిహెచ్ ఆవరణంలోని రేడియాలజీ భవనంలో క్షయ నియంత్రణ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణలో పోషకాహారం ముఖ్యపాత్ర పోషిస్తుందని, న్యూట్రిషన్ కిట్ లో నూనె, ప్రోటీన్ పౌడర్, గుడ్లు, పప్పు మొదలైనవి ఉంటాయని తెలిపారు. రోగుల అవసరాల నిమిత్తం ప్రభుత్వం అందజేస్తున్న నెలకు రూ.1000 సక్రమంగా అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. క్షయ నిర్మూలనలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసినప్పుడే వ్యాధిని అంతమొందించవచ్చని, కేసుల గుర్తింపు కోసం నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం స్క్రీనింగ్ నిర్వహించాలని అన్నారు. రోగి ఇంట్లో ఉన్నవారికి ప్రివెంటివ్ ట్రీట్ మెంట్ ఇవ్వడం ద్వారా 90% వరకు క్షయ రాకుండా నివారించవచ్చని తెలిపారు. రోగికి మందులు ఇవ్వడంతో పాటు కాంటాక్ట్ ట్రేసింగ్, అవేర్నెస్ కార్యక్రమాల ద్వారా టీబీ రహిత లక్ష్యాన్ని చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, ట్రీట్ మెంట్ సూపర్ వైజర్లు, ల్యాబ్ సూపర్ వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 21 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు, ఆధార్ అనుసంధానం, అపర్ జనరేషన్ మరియు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నమోదు/అనుసంధానం, అపర్ జనరేషన్ మరియు ప్రగతిని సమీక్షించారు. ప్రతి మండల విద్యాశాఖాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రీ-ప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్ మరియు అపర్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా, విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓలకు సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి ప్రతి నెల తప్పనిసరిగా కనీసం 15 పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రగతి ఇతర అకాడమిక్ అంశాలను సమగ్రంగా పరిశీలించాలని, పాఠశాలలను సందర్శించిన సందర్భంగా అకాడమిక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన సూచనలు, సమస్యలు నిర్దేశించిన చర్యలు తదుపరి సందర్శన సమయంలో అమలు అయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను పరిశీలించి, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

లిమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు, వికలాంగుల వినతి



మల్కాజిగిరి ,ఆగస్టు21,(విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్య లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి కమిటీ సభ్యులు కోరారు. గురు వారం గాంధీభవన్ ఆవరణలోని ఇందిరా భవన్ లో వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి వారు హజరై, మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వికలాంగుల శాఖ కమీషనర్ గా వికలాంగులనే నియమించాలని, ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేం దుకు వికలాంగులైన పురుషులకు కూడా ఫ్రీ పాస్ ఇవ్వాలని కోరారు. అలాగే, వికలాంగులకు కొత్త పించన్లు మంజూరు చేసి, రూ 4,016 పించను దారులకు రూ 6,000 పించను పెంచాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు ప్రాముఖ్యత ఇవ్వాలని, బ్యాక్ లాగ్ ఫోస్టుల నోటిఫికేషన్ రిలీజ్ చేయాలని,వికలాంగుల సంక్షమ శాఖ డైరెక్టర్ గా ఐఏఎస్ ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి కమిటీ సభ్యులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, హైదరా బాద్ అధ్యక్షులు పెద్దగొల్ల నాగరాజు, రాష్ట్ర మహిళా నాయకురాలు యశోద తదితరులు ఉన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి


**- రూ.2,800 కోట్ల విడుదలకు సీఎం ఆమోదం సమీక్షలో మంత్రి**
**- రైతులతో సమన్వయంతో సమస్యల పరిష్కారం కలెక్టర్ ఆదర్శ్ సురభి**




వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా సమీక్ష నిర్వహించారు. వనపర్తి సమీకృత కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయి కొత్త ఆయకట్టు అందుబాటులోకి రావాలంటే పెండింగ్ భూసేకరణను పూర్తి చేయడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని స్పష్టం చేశారు. అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారులు స్వయంగా పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, నీటిపారుదల శాఖ డిప్యూటీ సీఈ వెంకట్ రెడ్డి, ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జ్వరంతో వస్తే డెంగ్యూ, మలేరియా పరీక్షలు తప్పనిసరి

**- ఫ్రైడే-డ్రైడే పకడ్బందీగా నిర్వహించాలి**
**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో పర్యటించిన ఆయన, ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న ఫ్రైడే-డ్రైడే నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరం లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. దోమలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు.

***- పార్కుల పునరుద్ధరణకు చర్యలు***

రామ్‌నగర్ కాలనీలోని మున్సిపల్ పార్కును పరిశీలించిన కలెక్టర్, పార్కు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు తక్షణమే సిద్ధం చేయాలన్నారు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న పార్కులను గుర్తించి నివేదిక సమర్పించాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాటిని అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

***- పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలి***

అనంతరం కేడీఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానాను సందర్శించి, ఓపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ముఖ్యంగా పాము కాటు, కుక్క కాటు బాధితులకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మందుల నిల్వలు, సేవలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, స్థానిక కౌన్సిలర్ పరశురాం, మున్సిపల్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరో వార్డులో కౌన్సిలర్ బైకని సునీత-ఓదెలు ప్రత్యేక చొరవ

**- పారిశుద్ధ్య పనులతో పాటు స్మశాన వాటిక అభివృద్ధిపై దృష్టి**





ములుగు ఆగస్టు 19, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీ ఆరో వార్డులో కౌన్సిలర్ బిబైకని సునీత-ఓదెలుబి ఆధ్వర్యంలో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పిచ్చి మొక్కల తొలగింపు:లివార్డు పరిధిలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలతో దోమలు వ్యాపించి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు దృష్టికి తీసుకురావడంతో కౌన్సిలర్ వెంటనే స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో పిచ్చి మొక్కలపై పురుగు మందు పిచికారీ చేయించి, పరిసరాలను శుభ్రం చేయించారు.

స్మశాన వాటిక అభివృద్ధి:
అదే విధంగా ఆరో వార్డు స్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపల్ కమిషనర్ బిసంపత్‌బి తో కలిసి స్మశాన వాటికను సందర్శించారు. స్మశానానికి వెళ్లే దారిలో వెలుతురు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గుర్తించి, ఆ దారిలో కరెంట్ పోల్స్ వేయించి లైట్లు ఏర్పాటు చేసే అంశంపై కమిషనర్ తో చర్చించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బిబైకని సునీత-ఓదెలుబి మాట్లాడుతూ వార్డు ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనయే తమ ప్రధాన లక్ష్యమని, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. స్మశాన వాటిక అభివృద్ధికి త్వరలోనే ఎస్టిమేషన్ వేయించి పనులు ప్రారంభిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. సమస్యలపై వెంటనే స్పందిస్తున్న కౌన్సిలర్ కు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## పనులను పరిశీలించిన పడమటి మల్లారెడ్డి



కాప్రా/ ఆగష్టు 21 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కాప్రా సర్కిల్ పరిధిలోని వంపుగూడ డివిజన్ పరిధిలో శు క్రవారం నాడు డ్రైనేజీ పనుల మరమ్మతులు పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పడమటి మల్లారెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంపుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా వీధిలో డ్రైనేజ్ పైప్ లైన్ కుంగిపోయిందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి కృంగిపోయిన పైప్ లైన్ వెంటనే సరి చేయవలసిందిగా అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించడం జరిగింది అని తెలిపారు. కాలనీవాసులు మాట్లాడుతూ పరమేశ్వర్ రెడ్డి కి, మల్లారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతం చేయాలి

**- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

ఆదిలాబాద్, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర): నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించగా, కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేస్తోందని, అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

# పట్టణ డైరెక్టరీ ఏర్పాటుకు అధికారుల సమన్వయం..

**- వివిధ శాఖల నుంచి సమగ్ర సమాచార సేకరణ..**

**- కమిషనర్.సి.ఎచ్.హన్మంత రెడ్డి..**



సూర్యాపేట ఆగస్టు 21:(విజన్ ఆంధ్ర) : డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్‌లో భాగంగా సూర్యాపేట పట్టణ డైరెక్టరీ ఏర్పాటుకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు వివిధ శాఖల అధికారులతో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని విద్య, వైద్యం, రోడ్లు, భవనాలు, మున్సిపల్, సీడీపీఓ, విద్యుత్,పంచాయతీరాజ్, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన సదుపాయాలు, వసతులు, మౌలిక సదుపాయాల వివరాలను సేకరించి పట్టణ డైరెక్టరీని రూపొందించనున్నట్లు కమిషనర్ తెలిపారు. 2025 డిసెంబర్ 31 నాటికి ఉన్న సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని డైరెక్టరీని రూపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.పట్టణంలో అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ, ప్రజా సదుపాయాలకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత శాఖల అధికారులు సకాలంలో అందించాలని కమిషనర్ కోరారు.శాఖల వారీగా సరైన సమాచారాన్ని సేకరించడం ద్వారా పట్టణ డైరెక్టరీని సమగ్రంగా రూపొందించేందుకు సహకరించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగప్రసాద్, చీఫ్ ప్లానింగ్ ఎస్.ఓ.రామారావు, రాజేష్, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఈఈ, డిపీఓ సోమయ్య, బొడ్రాయి బజార్ అంగన్వాడీ సెక్టార్ సూపర్వైజర్ గోనే నాగమణి,టౌన్ ప్లానింగ్ సిబ్బంది అఖిల్ రెడ్డి, శివాజీ,సెక్షన్ క్లర్క్ గోపారపు రాజు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మెషిన్

**- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 21,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించేందుకు "ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పంపిణీ పథకము" క్రింద ఆటోమేటిక్ కుట్టు మిషన్ లను 100 శాతం రాయితీతో అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ట్టీజూ:7/స్త్రశీఎ-ఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా సెప్టెంబర్ 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మహిళల వయస్సు 18 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలని, నిరుద్యోగ మహిళలు, పేదలు, నిరాదరణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులకు, అనాద మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికేట్ ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తెలిపారు. తెల్లరేషన్ కార్డు / ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రము కలిగి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయము గ్రామీణులకు 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ వాసులకు 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. 2023-24 సంవత్సరంలో బి.సి. ఓకేషనల్ స్కీమ్ స్వయం ఉపాధి పథకం క్రింద ఆర్థిక లబ్ది పొందిన వారు అర్హులు కారని, పథకము మంజూరు కొరకు దరఖాస్తుదారులు డౌన్ లోడ్ చేసుకొని సంబంధిత కుల, ఆదాయ, నివాసం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యా అర్హతలు, టైలరింగ్ శిక్షణ / అనుభవం తదితర ధృవీకరణ పత్రాలతో గ్రామీణులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, పట్టణ వాసులు మున్సిపల్ కార్యాలయంలో సెప్టెంబర్ 13వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, ఆన్లైన్ చేసిన దరఖాస్తును సంబంధిత అధికారికి సమర్పించనిచో ఆ ధరఖాస్తు పరిగణలోకి తీసుకోబడదని తెలిపారు.

# మానోపాడ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



మానోపాడ్ ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : వార్షిక తనిఖీల్లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా మానోపాడ్ మండల పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది కిట్, వాహనాలను పరిశీలించారు. కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు, బీట్ పెట్రోలింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడుతూ విధి నిర్వహణలో సేవాభావం, నిజాయితీతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. డయల్-100/112కు వేగంగా స్పందించాలని, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పోలీస్ యాప్‌లను సమర్థంగా వినియోగించి నేరాలను అరికట్టాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఎస్పీ, డీఎస్పీ మొక్కలు నాటారు.

# భూసేకరణకు బ్రేకులు తొలగించాలి.. ప్రాజెక్టులకు వేగం పెంచాలి

**- భూసేకరణ కోసం రూ.2,800 కోట్లు విడుదలకు ఆమోదం**

**- ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశం**



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తికావాలంటే పెండింగ్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడం అత్యంత అవసరమన్నారు. భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసేందుకు ఆమోదం తెలిపిందని వెల్లడించారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టుల పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని సూచించారు. జిల్లాలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి రాజన్న సిరిసిల్ల జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి, మధ్య మానేరు, కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే.ఎస్.బీ. కుమారి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి దయాకర్, ఎస్‌డీసీ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి ప్రశాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సొసైటి పేరుతో అక్రమాలు ఆపు మల్లారెడ్డి..!!

**- అర్హత లేకున్న ప్లాట్ల డబుల్ రిజిస్ట్రేషన్లు..నకిలీ పత్రాల ఆరోపణలు**

**- బైలా నిబంధనకు విరుద్ధంగా తన కుటుంబ సభ్యులకు పేర్లపై రిజిస్ట్రేషన్లు**

**- గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు...మళ్ళీ ఫిర్యాదు చేయనున్న భాదితులు**

**- విలేకరుల సమావేశంలో సత్యనారాయణపురం కాలనీ అసోసియేషన్.....**



మేడిపల్లి: సత్యనారాయణపురం కాలనీలోని శ్రీరమణ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరును అడ్డుపెట్టుకుని అనేక అక్రమాలకు పాల్పడి కోట్లు దండుకున్న మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని సత్యనారాయణపురం కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కోన్నారు.శుక్రవారం సత్యనారాయణపురం కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సొసైటీ అధ్యక్షుడి పేరుతో కె. మల్లారెడ్డి బైలా నిబంధనలకు విరుద్ధంగా సొసైటీకి సంబంధించిన లావాదేవీల్లో కుటుంబ సభ్యుల పేర్లతో ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేసి కోట్ల కూడకట్టుకున్నారని ఆరోపణలను అసోసియేషన్ ప్రతినిధులు లేవనెత్తారు.అర్హత, సభ్యత్వ నిబంధనలు, ప్లాట్ కేటాయింపులపై జరిపారని తెలిపారు. సుమారు 100 వరకు అనుమానాస్పద పత్రాలు ఉన్నాయని, ఒకే ప్లాట్ నంబర్, సర్వే నంబర్, హద్దులను ఆధారంగా చేసుకుని వేర్వేరు లావాదేవీలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.సొసైటీ బైలా నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వ్యక్తులను సభ్యులుగా చేర్చి సభ్యత్వ నంబర్లు కేటాయించారనే ఆరోపణలు చేశారు.సొసైటీకి సంబంధం లేని వ్యక్తులు రెక్టిఫికేషన్, క్యాన్సిలేషన్ డీడ్లను నమోదు చేసినట్లు పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై గతంలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపించారు. ప్రస్తుతం నారాపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన పలు డాక్యుమెంట్లను పోలీసులకు సమర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై మల్లారెడ్డి మీద కొన్ని సివిల్, క్రిమినల్ కేసులు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. నకిలీ పత్రాలు, మోసం, డబుల్ రిజిస్ట్రేషన్లు, అనధికారిక ప్లాట్ కేటాయింపులపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికితీయాలని పోలీసులను కోరారు. బాధితుల ప్రయోజనాలను కాపాడేందుకు సంబంధిత రిజిస్ట్రేషన్ రికార్డులు, సొసైటీ బైలా, సభ్యత్వ రిజిస్టర్లు, ప్లాట్ కేటాయింపు పత్రాలను పూర్తిగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సత్యనారాయణపురం కాల నీ అధ్యక్షుడు ఏ.జంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి టి. భాస్కర్,కోశాధికారి సోలిపురం ముత్యంరెడ్డి,సహాయ కార్యదర్శి జి రంగారెడ్డి,ముఖ్య సలహాదారులు మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెట్టెంపాడు ఆయకట్టు ప్రాంత పనులు పూర్తి చేయాలి

**- నీటిపారుదల అధికారులతో కలిసి గుడెందొడ్డి రిజర్వాయర్ పరిశీలన**

**- సూపరింటెండింగ్ ఇంజనీర్ కేశవరావుకు వినతిపత్రం అందజేసిన -ఎమ్మెల్యే విజయుడు**



అలంపూర్ ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఆలంపూర్ నియోజకవర్గ కీలకమైన సాగునీటి పనులు పూర్తి కాకపోవడం వల్ల తమకు ఎదురవుతున్న దీర్ఘకాలిక సమస్యలను రైతులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఆలస్యం కావడం వల్ల, వేలాది ఎకరాల సాగుభూమికి నీరు అందక రైతాంగం, ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జవహర్ నెట్టెంపాడుఎత్తిపోతల పథకంలోని గూడెందొడ్డి రిజర్వాయర్ దగ్గర ప్యాకేజీ నంబర్లు 99, 100 కింద కాల్వ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. తద్వారా ఎలాంటి ఆలస్యం లేకుండా చివరి ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందించవచ్చు.తాటికుంట రిజర్వాయర్‌కు అనుసంధానించే ప్యాకేజీ నం. 106 కింద ఉన్న లింక్ ఛానల్ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ కీలకమైన లింక్ పూర్తి కావడం అనేది కొత్త ఆయకట్టు, చివరి ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించడానికి ఎంతో అవసరం.కరవు పీడిత ప్రాంతాలకు సాగునీటి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో స్వర్గీయ వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో ఈ ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. దురదృష్టవశాత్తు, ఇన్ని సంవత్సరాలు గడిచినా, ఈ ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉండిపోయి, రైతాంగానికి అందాల్సిన ఫలాలు దక్కకుండా పోతున్నాయి. ఇటిక్యాల, ఐజ, వడ్డేపల్లి , మానవపాడు మండలాల రైతులు నూతన ఆయకట్టు కింద సాగునీటి సౌకర్యాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ పనులను పూర్తి చేయడం వల్ల ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు అందుతుంది, వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుంది, రైతుల జీవనోపాధి మెరుగుపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద ఉన్న ప్యాకేజీ నంబర్లు 99, 100, 106 కాలువలో పెరుకపోయిన జమ్మును గడ్డి ని వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందుతుందని పనులను త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొనడం జరిగింది.

# 1855 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

**- సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**



సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు: 21(విజన్ ఆంధ్ర )జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన మహిళలు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాధ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# నాంపల్లి గుట్టకు కొత్త అందాలు.. అభివృద్ధి పనుల పరిశీలన

**- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానం ఏర్పాటు పనులను పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేసి భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని సూచన**



వేములవాడ, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో): వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి గుట్టపై వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. నాంపల్లి గుట్టపై ఏర్పాటు చేయనున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాన్ని ఇప్పటికే తరలించగా, విమానం ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విమానం ఏర్పాటు, సుందరీకరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కలెక్టర్ పూజలు నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కలెక్టర్‌కు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే.ఎస్.బీ. కుమారి, తహసీల్దార్ జయంత్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

**- రైతుల పంటలను ప్రభుత్వం ఆదుకోవాలి**


**- బాపన్ పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్**



నారాయణపేట, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా దామర్‌గిద్ద మండలం బాపన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నారాయణపేట జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, బాపన్‌పల్లి గ్రామ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌లను పరిశీలించి, రైతులకు అందుతున్న విద్యుత్ సరఫరా పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నారాయణపేట నియోజకవర్గంలోని రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని, ప్రస్తుతం సుమారు 12 గంటల మేర మాత్రమే విద్యుత్ అందుతోందని అన్నారు. అందులోనూ రెండు, మూడు గంటల పాటు మధ్యలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు సాగునీరు అందించడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతులకు తక్షణమే అవసరమైన సహాయాన్ని అందించాలని గవినోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పల్లెబండ నర్సిములు, అశోక్, మెట్టు పాండు తదితరులు పాల్గొన్నారు.

# 27న జేఏసీ ధర్నాను విజయవంతం చేయాలి.

**- టీజీ ఈ జేఏసీ చైర్మన్ ఎం. నరసింహారెడ్డి.**



నారాయణపేట ఆగష్టు 21( విజన్ ఆంధ్ర) : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న నారాయణపేట జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్కు వద్ద టీజీ ఈ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ ఎం. నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో టీజీ ఈ జేఏసీ భాగస్వామ్య సంఘాల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జేఏసీకి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల చెల్లింపు, సీపీఎస్ రద్దు, మూడు నెలలుగా అమలుకు నోచుకోని హెల్త్ కార్డుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలోని జీఓ 25ను సవరించి ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, 317 జీఓ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. 2004 సెప్టెంబరు 1కు ముందు నోటిఫికేషన్ వెలువడిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వాయిదా పడిన ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించే ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ధర్నాను విజయవంతం చేసేందుకు జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒక్కొక్క ఉద్యోగి నెలకు కనీసం రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు నష్టపోతున్నారని నాయకులు పేర్కొన్నారు. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సహనాన్ని ప్రభుత్వం పరీక్షించవద్దని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునే సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ వై. జనార్దన్‌రెడ్డి, కో-చైర్మన్లు రెడ్డప్ప, భీమయ్య, సూర్యచంద్ర, సంతోష్‌కుమార్, రాంరెడ్డి, యశ్వంత్, భాగస్వామ్య సంఘాల నాయకులు హైమావతి, వేణుగోపాల్, రఘువీర్, వాళ్య నాయక్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## బీసీఐ చైర్మన్ రాజీనామాకు న్యాయవాదుల డిమాండ్



గోదావరిఖని ఆగస్టు-21(విజన్ ఆంధ్ర) : బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు శుక్రవారం నిరసన చేపట్టారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యురాలు శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. బీసీఐ న్యాయవాదుల వృత్తి ప్రమాణాలను పరిరక్షించడంతో పాటు న్యాయ విద్య, న్యాయ కళాశాలలు, న్యాయవాద వృత్తి అభివృద్ధిని పర్యవేక్షించాల్సిన అత్యున్నత చట్టబద్ధ సంస్థ అని న్యాయవాదులు పేర్కొన్నారు. అలాంటి సంస్థ రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే బీసీఐ చైర్మన్ తన పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు న్యాయవాద వర్గాల నుంచి వస్తున్నాయని తెలిపారు. ఏకపక్షంగా సర్క్యులర్లు జారీ చేయడం, న్యాయవాదుల వృత్తి స్వాతంత్ర్యం, గౌరవానికి భంగం కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. బీసీఐ ఏ రాజకీయ పార్టీకి అనుబంధ సంస్థ కాదని, న్యాయవాదుల హక్కులు, వృత్తి స్వాతంత్ర్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన సంస్థ అని స్పష్టం చేశారు. సంస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పాక్షికతను పునరుద్ధరించేందుకు సమగ్ర ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా తక్షణమే పదవికి రాజీనామా చేయాలని, న్యాయవాదుల ప్రయోజనాలను కాపాడే విధంగా సంస్థను బలోపేతం చేయాలని కోరారు. న్యాయవాద వృత్తి గౌరవం, స్వాతంత్ర్యం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుతామని ఈ సందర్భంగా న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జవాజి శ్రీనివాస్ గుడికందుల భూమయ్య ఎండి ఉమర్ దుడపక లింగస్వామి గొట్ట నరేష్ వెంకటేశ్వర్లు శ్రీలత రేష్మ సుజాత తిలక్ ఆసిఫ్ సతీష్ దామోదర్ తిరుపతి రెడ్డి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలి.

**- బద్రి సత్యనారాయణ సీనియర్ నాయకులు**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21. (విజన్ ఆంధ్ర) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ నందు భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. మొదట సురవరం సుధాకర్ రెడ్డి కి నివాళులు అర్పించి కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించుకోగా, ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పైన ఎప్పటికప్పుడు స్పందించి ప్రజా పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు నిర్వహించాలని వారి ఆశయ సాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలపై తీర్మానాలు చేయడం జరిగింది. ఆ సమస్యల పరిష్కారానికై వివిధ రూపాలలో పోరాటాలు నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక చేసుకోవాలని నిర్ణయించారు.

తీర్మానాలు

1.కుమురం భీం ప్రాజెక్టు ఆయకట్టు మరమ్మతులు వెంటనే చేపట్టి రైతులకు సాగునీరు అందించాలి.

2.వట్టివాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిలి, రైతుల పంటలకు సాగునీరు అందించాలి.

3.గుండి వాగు, లక్మాపూర్ బ్రిడ్జిల నిర్మాణం వెంటనే చేపట్టి ప్రజల రాకపోకల సమస్యను పరిష్కరించాలి.

4.నేషనల్ హైవే నిర్మాణంలో నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని, డీబీఎల్ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి.

5.పీఎం శ్రీ నిధుల వినియోగంలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రత్యేక కమిషన్‌తో సమగ్ర విచారణలి జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.



6.మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకులం, ఆసిఫాబాద్‌లో జరిగిన అక్రమ అడ్మిషన్లపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన ప్రిన్సిపాల్‌పై చర్యలు చేపట్టాలి.

7.గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యేక చొరవతో వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి.

8.జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియాన్ని వెంటనే ప్రజలకు, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలి.

9.డైట్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభించి, కళాశాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి.

10.గిరిజన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వంత భవనం మంజూరు చేసి, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.

11.పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో గిరిజనుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని, వారికి న్యాయం చేయాలి.

12.వ్యవసాయ శాఖ జిల్లా అధికారిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, తప్పిదాలు రుజువైతే కఠిన చర్యలు చేపట్టాలి.

13.రేషన్ డీలర్లుప్రైవేట్ వ్యాపారులురైస్ మిల్లర్ల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, రేషన్ బియ్యం అక్రమాలపై బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి.



14.సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలి. స్థానిక ఉపాధి విషయంలో లేబర్ ఆఫీసర్, ఉపాధి కల్పన అధికారి వ్యవహరించిన తీరుపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

15.మిషన్ భగీరథ కార్మికులకు నెలనెలా వేతనాలు సకాలంలో చెల్లించాలి. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి.

16.సింగరేణి DMFT నిధులపై 2014 నుంచి నేటి వరకు పూర్తి శ్వేతపత్రం విడుదల చేయాలి.లిలి నిధుల కేటాయింపు, ఖర్చులు, చేపట్టిన అభివృద్ధి పనుల పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలి. పై సమస్యలు జిల్లాలోని ప్రజల జీవనోపాధి, విద్య, ఉపాధి, వ్యవసాయం, మౌలిక వసతులు మరియు సామాజిక న్యాయంతో నేరుగా ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఈ డిమాండ్లపై సంబంధిత శాఖల అధికారులకు తెలియజేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరపున పోరాడాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ తిరుపతి, మారం శ్రీనివాస్, బోయిరే ప్రకాష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్, ఆత్రం సీతారాం, ముంజం బుద్ధాజీ, చిప్ప దిలీప్, అంబారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలి..

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి..**



సూర్యాపేట ఆగస్టు 21:(విజన్ ఆంధ్ర) : ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం పోస్ట్ ఆఫీస్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పైసీ దర్బార్ బిర్యానీ సెంటర్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, బిర్యానీ సెంటర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. సూర్యాపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పైసీ దర్బార్ బిర్యానీ సెంటర్ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో నూతనంగా అడుగుపెడు తున్న నిర్వాహకులు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రజలకు రుచికరమైన బిర్యానీతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తూ మంచి పేరు సంపాదించాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో కొత్తగా వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కరీం, రాపర్తి నాగరాజు,నర్సింగ్ మహేష్, అయూబ్ ఖాన్, పందిరి మల్లేష్, కుందమల్ల శేఖర్, రాజు, మనోజ్, అప్సర్, కిరణ్, బాబా, నిర్వాహకులు మహమ్మద్ నసీర్, అమిద్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు తీరు తీరు పూలు పుస్తకావిష్కరణ

**- కవి మట్టే రవీందర్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 21,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన సీనియర్ పాత్రికేయులు, కవి మట్టె రవీందర్ రాసిన మరో కవిత ప్రచురణకు ఎంపికైంది. అక్షయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 'తీరు తీరు పూలు' శీర్షికతో వెలువడుతున్న సంచికలో రవీందర్ కవిత ప్రచురితమైంది. రవీందర్ రాసిన నిస్సహాయ జీవితం కవితను అక్షయ సాహితీ సంస్థ నిర్వాహకులు ముద్రణకు ఎంపిక చేశారు. అందంగా ముస్తాబు ముద్రితమైన సంచిక ఈనెల 23వ తేదీన ఆవిష్కరించనున్నారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో వచ్చే ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత, చరిత్ర పరిశోధకులు డాక్టర్ తుమ్మల దేవ్ రావు, పుస్తకం పరిచయకర్తగా ప్రముఖ రచయిత్రి నీలాదేవి హాజరు కానున్నట్లు సాహితి అక్షయ సాహితి సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు న్యాటెంకి రవీందర్, వేనంక చక్రవర్తి వెల్లడించారు. సాహిత్యమూర్తులు కార్యక్రమంలో పాల్గొని పుస్తకావిష్కరణను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## శ్రీ సత్యసాయి నిత్య అన్నదాన 14వ వార్షికోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర): రిమ్స్ ఆసుపత్రిలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకం 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గత 14 ఏళ్లుగా నిరుపేద రోగులు, సహాయకులకు నిరంతరంగా పౌష్టికాహారం అందిస్తున్న నిర్వాహకులు, దాతల సేవలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా రోగుల సహాయకులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ సింగ్ రాథోడ్, సేవా సమితి ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో కుర్చీపై యూనిఫాం చీర..!


**- టీచర్ బాధ్యతారాహిత్యంపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం**

**- చిన్నారుల కేంద్రానికి ఇదేం దుస్థితి..?**

**- నిర్వహణ తీరుపై విమర్శలు**

**- అంగన్వాడీ కేంద్రాలపై అధికారుల నిఘా కరువు..?**

**- అధికారుల పర్యవేక్షణ ఏది..?**




సూర్యాపేట ఆగస్టు 21:(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వం ఎంతో గౌరవప్రదంగా కేటాయించిన అధికారిక యూనిఫాం చీరను అంగన్వాడీ టీచర్ తీవ్రంగా అవమానించిన సంఘటన సూర్యాపేట పట్టణం 7వార్డు అంగన్వాడీ కేంద్రంలో వెలుగుచూసింది. విధులపట్ల కనీస గౌరవం లేకుండా, తన యూనిఫాం చీరను నిర్లక్ష్యంగా కుర్చీపై పడేసి, అవమానకర రీతిలో ప్రవర్తించడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల్లో ఉన్నప్పుడు అధికారిక దుస్తులు ధరించాల్సి ఉండగా, సదరు టీచర్ యూనిఫాంను ఒక వస్తువులా కుర్చీపై వేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. చిన్నారులకు ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయురాలే ఇలాంటి చర్యలకు పాల్పడటం విద్యావ్యవస్థకే మచ్చ తెచ్చేలా ఉందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందించాల్సిన అంగన్వాడీ కేంద్రంలో కుర్చీపై యూనిఫాం చీర కనిపించడం చర్చనీయాంశంగా మారింది. చిన్నారుల కోసం ఉపయోగించాల్సిన కేంద్రంలో సిబ్బంది వస్తువులు ఇలా కనిపించడంపై



స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత, సమయపాలన, చిన్నారుల హాజరు, పౌష్టికాహారం పంపిణీ వంటి అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంది. అయితే కేంద్రం నిర్వహణ తీరును చూస్తే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎలా ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అంగన్వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉంది. చిన్నారులకు అనుకూలమైన వాతావరణం, పరిశుభ్రమైన పరిసరాలు, అవసరమైన సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.కేంద్రంలో యూనిఫాం చీర కుర్చీపై కనిపించిన ఘటనపై అధికారులు స్పందించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాల్సిన అంగన్వాడీ కేంద్రాల్లో ఇలాంటి దృశ్యాలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

సూర్యాపేట ఆగస్టు 21:(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ట్రైకార్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యములో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఉఫాది పొందగలరని శుక్రవారం జిల్లా కల్లెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. అదేవిధముగా పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులు ఐన వారు కోర్సులను మధ్యలో ఆపివేసిన విధ్యార్ధిని,విధ్యార్ధులకు కూడా ఇట్టి అవకాశం కలదు, ఉచిత బోజన, వసతి సౌకర్యాలతో వివిధ కోర్సులలో 3 నుండి 6 నెలల పాటు శిక్షణా కల్పించి తదనంతరం ఉపాధి అవకాశాలు కల్పించబడునని తెలిపారు. ఇట్టి శిక్షణా సెంటర్లు 1) కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ దగ్గర, పిగలీపూర్ (వి), రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర, రంగారెడ్డి జిల్లా 2) వైటిసి,దేవరకొండ యందు కలవు. కావున ఇట్టి ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఆసక్తి గల వారు 25 ఆగస్టు 2026 వరకు ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహం, కోదాడ(ఎ)(సెల్:9912739723) ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహం, సూర్యాపేట (సెల్:9505767833) యందు మీ పేర్లు రిజిస్టర్ చేసుకోగలరు.

# పేటలో ప్రైవేట్ ఉపాధ్యాయుల శాంతియుత నిరసన ర్యాలీ..

సూర్యాపేట,ఆగస్టు 21 :(విజన్ ఆంధ్ర) : నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లి గ్రామంలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యకు గురి కావడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆమె ఆత్మకు శాంతి కలుగాలని కోరుతూ యునైటెడ్ ట్రస్మా, తెలంగాణ ప్రైవేట్ టీచర్ అండ్ లెక్చరర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 2వేల మంది ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువదని అలాంటి గురువును దారుణంగా హత్య చేయడం దారుణమన్నారు. ఏ గురువైనా విద్యార్థులను మంచిగా ఉండమని చెబుతారు తప్ప చెడిపోమ్మని కాదన్నారు. తమ నుంచి విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు గంజాయికి బానిసై, మాదకద్రవ్యాలకు అలవాటు పడి చెడు ప్రవర్తనతో ఉంటే మందలించడం రూపారెడ్డి తప్పా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య భారతదేశంలో టీచర్లకు రక్షణ, కఠిన చట్టాలు లేక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు స్పందించి నవతరాన్ని తయారు చేసే ఉపాధ్యాయులకు రక్షణ కల్పించడంతో పాటు వారి కోసం కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఏది



చెప్పినా అది మన మంచి కోసమే అని విద్యార్థులు గ్రహించాలని అప్పుడే వారు మంచి పౌరులుగా సమాజంలో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ట్రస్మా ప్రతినిధులు త్రివేణి హరి, ఆర్.ప్రకాష్ రెడ్డి, పగడాల ఉపేందర్ రెడ్డి, రామసాని శ్రీనివాస్ నాయుడు, ఖమ్మంపాటి భిక్షపతి, గాలి రమేష్, మారం లింగారెడ్డి, వెంపటి అజయ్ కుమార్, తీగల ఉపేంద్రరావు,రామసాని రాజు, టీపీటీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహరావు, గౌరవాధ్యక్షులు సోమరాజు, ఉపాధ్యక్షులు బాలక్రిష్ణ, రాజశేఖర్లతో పెద్ద ఎత్తున ప్రైవేట్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## వరలక్ష్మి దేవి రావమ్మా... మా పూజలందుకోవమ్మా...

**- ప్రతి ఇంట్లో వరలక్ష్మి వ్రతాలే...**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 21,(విజన్ ఆంధ్ర ) : శ్రావణం మాసంలో రెండో శుక్రవారం ఎంతో ప్రీతి పాత్రమైనదని అ లక్ష్మి దేవుని పూజిస్తే ఎంతో శుభప్రధమని, అమ్మ అనుగ్రహం కలుగుతుందని వేదంపండితులు చెబుతుం తారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మహిళలు ఒక రోజు ముందుగానే పూజకు కావాల్సిన సామాగ్రిని సిద్దం చేసుకున్నారు. లక్ష్మీదేవి ని ఆరాధించెందుకు ఉదయం లేచినప్పటినుంచి పూజ గదిని సర్వంగా సుందరంగా అలంకరించారు. వరలక్ష్మి వ్రతం ఆచరించి, అమ్మవారికి పలు రకాల నై వేద్యాలు తయారు చేశారు. పూజ అనంతరం ఇంటికి వచ్చిన మహిళలకు తీర్ధ ప్రసాదాలు అందించడమే కాకుండా తాంబూలం (వాయినం అందజేశారు.) వరలక్ష్మి నమోస్తుతే అంటూ ఆరాధిస్తారు... ఆలయాల్లో సైతం ఉదయం నుంచే భక్తులు బారులు తీరడం తో ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి.

# ఆటో కార్మికుల హామీలను అమలు చేయాలి..

సూర్యాపేట ఆగస్టు 21:(విజన్ ఆంధ్ర) : ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ నెల 24న నిర్వహించనున్న ఆటో కార్మికుల బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యానికి ఈ ఆటోలను అందించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని అన్నారు. ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని కోరారు.ఓలా, ఉబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం స్వయంగా ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అక్రమంగా యాప్‌ల ద్వారా నడుస్తున్న ద్విచక్ర వాహనాలను నియంత్రించి ఆటో కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని, ప్రజలకు నిత్యం రవాణా సౌకర్యం కల్పించే ఆటో డ్రైవర్లకు ఈ-చలాన్ల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.జీవో నంబర్ 263లో పేర్కొన్న మిగిలిన ఆటోలను వెంటనే అందించాలని, హైదరాబాద్ నగరంలో ఇతర జిల్లాల నుంచి వచ్చి అక్రమంగా నడుస్తున్న ఆటోలను నియంత్రించాలని అన్నారు. వాహన సారథి ద్వారా ఆటో డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని కొనసాగించాలని, రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్ల విషయంలో జీవో ఎంఎస్ నంబర్ 60 ప్రకారం ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గిగ్ ప్లాట్‌ఫామ్, యాప్ ఆధారిత సోషల్ సెక్యూరిటీ



బోర్డులో ఆటో, క్యాబ్ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమా కొనసాగించడంతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని కోరారు. 50 సంవత్సరాలు పూర్తయిన ఆటో కార్మికులకు పెన్షన్ అందించాలని, ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జగదీష్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24న నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ గ్రంథాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, డిఆర్టియు యూనియన్ అధ్యక్షులు కుర్రి సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అహ్మద్, పట్టణ అధ్యక్షుడు ఖుషి వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న, మరియు మట్టయ్య, నరేష్, సొందు, వేణు, రాజు, వెంకన్న, మాంగళ్య వెంకన్న, అనాసపురం యూసుఫ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర): స్థానిక ఉర్దూ భవన్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ, గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం, పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువత కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ రీడింగ్ రూమ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేర్‌లో అరుదైన కిడ్నీ మార్పిడి విజయవంతం



హైదరాబాద్, ఆగస్ట్ 21 (విజన్ ఆంధ్ర) : కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీలో 60 ఏళ్ల ఉపాధ్యాయుడికి భార్య కిడ్నీ దానం చేయగా, రక్త గ్రూపులు సరిపోకపోయినా విజయవంతంగా ఏబీఓ ఇన్‌కంపాటిబుల్ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించినట్లు కేర్ హాస్పిటల్స్ సీఓఓ డాక్టర్ ప్రమోద్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోగికి గత రెండేళ్లుగా డయాలసిస్, మధుమేహం, హైబీపీ సమస్యలు ఉన్నాయని తెలిపారు. వైద్య బృందం డాక్టర్ బి.ఆర్.జి.అరవింద్ రెడ్డి, డాక్టర్ సుశాంత్ కులకర్ణి, డాక్టర్ జె.అల్ రంగనాథ్ ఆధ్వర్యంలో ప్లాస్మాఫెరిసిస్, ఇమ్యూనోసప్రెసివ్ చికిత్సతో మార్పిడి చేసినట్లు చెప్పారు. ఇది క్లిష్టమైన కేసు అయినప్పటికీ విజయవంతమైందని తెలిపారు. భార్య దానం చేసిన కిడ్నీతో రోగికి కొత్త జీవితం లభించిందని తెలిపారు.

## పెద్దపల్లి జిల్లా డీపీఆర్వోగా బి.తిరుమల బాధ్యతలు స్వీకరణ

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-21(విజన్ ఆంధ్ర) : జిల్లా పౌర సంబంధాల అధికారిణి (డీపీఆర్వో)గా బి.తిరుమలను నియమిస్తూ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం పెద్దపల్లి జిల్లా డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశమై శాఖ కార్యకలాపాలు, మీడియా సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల సమాచారాన్ని సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

## భక్తులతో కిక్కిరిసిన లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయం..పులకించిన భక్తులు



నారాయణపేట , ఆగస్టు 21 ( విజన్ ఆంధ్ర) : పవిత్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా కొండ కొనల మధ్య గల లోకాయ పల్లి లక్ష్మమ్మ దేవాలయం మహిళలు భక్తులతో తో కిక్కిరిసి పోయింది. అంతకుముందు ఆలయ అర్చకులు సోమ శేఖరస్వామి మంత్రో చ్చరణాలతో అమ్మవారికి సుప్రభాతసేవా మహా అభిషేకం కుంకుమార్చన నూతన వస్త్రాలు సమర్పించి అమ్మ వారికి ఒడి నింపే కార్యక్ర మం మహా అలంకరణ నైవేద్యం మహా మంగళహా రతినిర్వహించారు.సర్వదర్శనంతో భక్తులు పిలకిం చారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం బట్టి ఎంకటమ్మ తిప్పన్న దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించి పెద్దఎత్తున భక్తులకు అన్నప్రసాద విత రణ చేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్,ఆలయ అధ్యక్షులు శశికాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మధుసుదన్ రెడ్డి, కోశాధికారి అశోక్ ఉపాధ్యక్షులు కన్నా జగదీష్ ,మాజీ సర్పంచ్ పిల్లి నర్సింహులు,సంతోష్ నామజీ భక్తులు మహిళలు పరిసర ప్రాంత ప్రజలు అధి క సంఖ్య లొ పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించు కున్నారు.

## నర్సింహా రెడ్డి ఆశయాలు కొనసాగిస్తాం



నారాయణపేట, ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : నారాయణ పేట జిల్లా లో పేద ప్రజలకు మరియు విద్యార్థులకు సేవ చేయాలని హాస్పిటల్ , విద్యాలయం స్థాపించి ఎన్నో ఉచిత క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యము, విద్యార్థులకు అతి తక్కువ ఫీజు తో ఇంగ్లీష్ మీడియం లో విద్యను అందించిన మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ డాక్టర్ పి. నర్సింహా రెడ్డి జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి శ్రీ సాయి స్కూల్ లో వారి సతీమణి పి.లలిత, పాఠశాల సిబ్బంది పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వసంత రావు మాట్లాడుతూ నారాయణ పేట జిల్లా లో డాక్టర్ పి. నర్సింహా రెడ్డి సార్ ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారని అన్నారు.ప్రజలకు అతి తక్కువ ఫీజు తో వైద్యం మరియు విద్యార్థులకు అతి తక్కువ ఫీజు తో విద్యా అందించిన మహనీయుడని అన్నారు.వారి ఆశయాలు నెరవేర్చుటకు పాఠశాల సిబ్బంది అందరూ కృషి చేస్తున్నారని తెలిపారు.వారు కేవలం విద్య,వైద్యం రంగాలలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా అట్టడుగు స్థాయి వారికి సంక్షేమ ఫలాలు అందించి చాలా మంది జీవితాలలో వెలుగు నింపడని అన్నారు.ముస్లింలకు రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు,హిందువులకు అయ్యప్ప స్వామి భక్తులకు మహా పూజలు ఏర్పాటు చేసి కుల మతాలకు అతీతంగా సేవ చేశారని కొనియాడారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా పదవి చేపట్టి ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీనా, బాలప్ప, హెచ్.నర్సింహా, సునీల్ రెడ్డి, సురేందర్ గౌడ్, రాధ కిషన్,రాహుల్, రోహన్, హరీష్, వనిత, మనీలా, శివ అమర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




నారాయణపేట , ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : దివంగత కాంగ్రెస్ నేత చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించు కొని శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఎ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమంలో లయన్ కుంభం శివకుమార్ రెడ్డి, లయన్ డాక్టర్ హరి నారాయణ బట్టడ్ ,లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్, లయన్ మోహన్ కుమార్ కోన, సెక్రటరీ, లయన్ రాజేష్ పోలేపల్లి, సీనియర్ లయన్స్ సభ్యులు లయన్ జనార్దన్, లయన్ సాయినాథ్, అలాగే వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఇన్‌చార్జ్ ,కోచ్ ఎస్. చక్రవర్తి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారియర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి ని, విద్యార్థులు ఉత్సాహం గా పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు.


# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

**- ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరించాలి**

**- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**- కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సంబంధిత సమస్యలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు రమేష్ బాబు, శ్రీధర్, శ్రీనివాసులుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టుల వారీగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నిర్దేశిత సమయంలోగా పరిహారం చెల్లించాలన్నారు. ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కావడం, కలెక్టర్ పీడీ ఖాతాలలో జమ కావడమే చెల్లింపు



పూర్తయినట్లు భావించరాదని మంత్రి స్పష్టం చేశారు. మంజూరైన మొత్తం చివరకు సంబంధిత లబ్ధిదారుడికి చేరడమే అసలు లక్ష్యమన్నారు. అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తై నిధులు అందుబాటులో ఉన్న చోట వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించిన అటవీ సమస్యలు, పెండింగ్ చెల్లింపులు, క్లియరెన్సులు, ఇతర అడ్డంకులను గుర్తించి ఇరిగేషన్ శాఖకు వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం స్థాయిలో జోక్యం అవసరమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తక్షణమే తీసుకెళ్లాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలు, ఆర్థిక అనుమతులు, టోకెన్లు, ఇతర ఆర్థిక, ప్రక్రియాపరమైన కారణాలతో ఏ సాగునీటి ప్రాజెక్టు ఆలస్యమవుతున్నా సంబంధిత కలెక్టర్, చీఫ్ ఇంజినీర్ సమస్యను స్పష్టంగా గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గద్వాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీసి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, మల్లికార్జున్, తదితరులున్నారు.

# డిసెంబర్ నాటికి వైద్య కళాశాల పనులు పూర్తి చేయాలి

**- నిర్మాణ పనులను వేగవంతం చేయాలి..**

**- నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి**

**- అధికారులకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**



కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 22(విజన్ ఆంధ్ర) : పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, డిసెంబర్ నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య కళాశాలలో నిర్మాణంలో ఉన్న వివిధ బ్లాకులను కలెక్టర్ పరిశీలించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రతి పనికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా పనుల వేగాన్ని పెంచాలని, అదే సమయంలో నాణ్యత విషయంలో



ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు నిర్మాణ పనులు చేపట్టాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం వైద్య కళాశాల ప్రధాన భవనాలు, హాస్టల్ భవనాలు, ఆసుపత్రి, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న అంతర్గత రహదారులు, లైబ్రరీ, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, విద్యార్థుల వసతి తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

**నెల రోజుల్లో హాస్టళ్ల పనులు పూర్తి చేయాలి**

బాయ్స్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా డిసెంబర్ నాటికి పూర్తిచేసే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**150 ఎంబీబీఎస్ సీట్లు**

కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రతి సంవత్సరం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాలలో బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వసతి, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుతున్నాయా, ఇంకా ఏమైనా అదనపు వసతులు అవసరమా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**జిల్లాకు కీలక ప్రాజెక్టు**

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ వైద్య కళాశాలలో విద్యార్థులు, బోధనా సిబ్బంది, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. పనుల పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో సంబంధిత వైద్య, ఇంజినీరింగ్, నిర్మాణ శాఖల అధికారులు, నర్సింగ్ కళాశాల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తిర్యాణి మండలంలో సుడిగాలి పర్యటించిన ఐటీడీఏ పీఓ శ్రీ మంద మకరందు....

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21( విజన్ ఆంధ్ర) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ITDA) ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు శుక్రవారం తిర్యాణి మండలంలోని పలు మారుమూల గిరిజన గ్రామాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దంతన్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన పీఓకు గ్రామస్తులు గతంలో ముంపునకు గురైన దంతన్‌పల్లి ఆశ్రమ పాఠశాలను తిరిగి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పీఓ, పాఠశాల పునఃస్థాపనకు సంబంధించిన సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత డీడీని ఆదేశించారు. పాఠశాల పునఃస్థాపనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.అనంతరం పంగడి మాదన గ్రామాన్ని సందర్శించిన పీఓ, రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాఎజ)ను పంగడి మాధార లో ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు పీఓను కోరారు. అలాగే గోవెన, మార్కెగూడ తదితర మారుమూల గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీనిపై పీఓ స్పందిస్తూ, మారుమూల గిరిజన గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం పంగడి మాదన ఆశ్రమ పాఠశాలను పీఓ సందర్శించారు,అనంతరం పదో తరగతి విద్యార్థులతో పీఓ నేరుగా ఇంటరాక్ట్ అయి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను మరింతగా పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.విద్యార్థుల



విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు నెల రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, నిర్దిష్ట లక్ష్యాలతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన అదనపు బోధనా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అనంతరం చింతల మాదార జలపాతాన్ని కూడా పీఓ సందర్శించారు. జలపాతం పరిసర ప్రాంతాల్లో గిరిజనులకు ఎదురవుతున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, స్థానిక గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. గిరిజనుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పీఓ సూచించారు. ఈ పర్యటనలో డీడీ జాదవ్ అంబాజీ, ACMO ఉద్ధవ్, MPDO, తహశీల్దార్, సర్పంచ్ రాధాబాయి, సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ మహేందర్ జీకి జన్మదిన శుభాకాంక్షలు .....

- బాదం ప్రవీణ్

ములుగు ఆగస్టు 21 విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ & సివిల్ సప్లై మహేందర్ జీబి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిబాదం ప్రవీణ్‌బి ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్ కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిబాదం ప్రవీణ్‌బి పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా పరిపాలనలో అదనపు కలెక్టర్ గా అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. అనంతరం బిబాదం ప్రవీణ్‌బి మాట్లాడుతూ మహేందర్ జీ ....... నిజాయితీ గల అధికారిగా జిల్లాలో మంచి పేరు తెచ్చుకున్నారని, రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు మరింత



సమర్థవంతమైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిబాదం ప్రవీణ్‌బి తో పాటు డి ఎస్ వో పైసల్ హుస్సేన్, డీ ఎం కృష్ణవేణి నాయక్, అసోసియేషన్ కార్యదర్శి సహోదర రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షులు రగోతం, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీకే కొరియన్ డెర్మా క్లినిక్‌లో స్కిన్, హెయిర్ కేర్ సేవలు



హైదరాబాద్, ఆగస్ట్ 21 (విజన్ ఆంధ్ర) : వీకే కొరియన్ డెర్మా క్లినిక్ హైదరాబాద్ అథెంటిక్ కొరియన్ స్కిన్, హెయిర్ కేర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు క్లినిక్ ఫౌండర్ కార్తీక్ పుత్తా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కొరియన్ టెక్నాలజీ, నిపుణులైన చర్మ వైద్యుల పర్యవేక్షణలో వ్యక్తిగత చికిత్సలను అందిస్తున్నట్లు తెలిపారు. పిగ్మెంటేషన్, మెలాస్మా, మొటిమలు, మచ్చలు, హెయిర్ ఫాల్, చుండ్రు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ తదితర సమస్యలకు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. హైదరాబాద్ కేంద్రానికి డాక్టర్ ప్రణయ్ రెడ్డి, బెంగళూరు సెంటర్‌కు డాక్టర్ అపూర్వ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు.

## 'రాఖీ ఎక్స్‌ప్రెస్' పేరుతో డిహెచ్‌ఎల్ రాయితీలు

హైదరాబాద్, ఆగస్ట్ 21 (విజన్ ఆంధ్ర) : డిహెచ్‌ఎల్ ఎక్స్ ప్రెస్ 'రాఖీ ఎక్స్‌ప్రెస్' పేరుతో భారత్ నుంచి అంతర్జాతీయ షిప్‌మెంట్లపై ఫ్లాట్ 50 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు డిహెచ్‌ఎల్ ఎక్స్ ప్రెస్ భారతదేశ వైస్ ప్రెసిడెంట్(కమర్షియల్) సందీప్ జునేజా శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆఫర్ ఆగస్టు 28 వరకు డిహెచ్‌ఎల్ ఎక్స్ ప్రెస్ భారతదేశ వైస్ ప్రెసిడెంట్(కమర్షియల్) సందీప్ జునేజా రాఖీ-50 ప్రోమో కోడ్‌తో వర్తిస్తుందని తెలిపారు. డిహెచ్‌ఎల్ ఎక్స్ ప్రెస్ భారతదేశ వైస్ ప్రెసిడెంట్(కమర్షియల్) సందీప్ జునేజా ఎక్స్ ప్రెస్, బ్లూ డార్ట్ రిటైల్ సర్వీస్ పాయింట్లు, మై డిహెచ్‌ఎల్ ప్లస్ లేదా కస్టమర్ సర్వీస్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ : 9833163620, 9007264050 లో సంప్రదించాలని అన్నారు.

# సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ

- ఆగస్టు 25న ఉదయం 11 గంటలకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 09 సీనియర్ రెసిడెంట్ పోస్టులను గౌరవ వేతనం పద్ధతిలో భర్తీ చేయడానికి అర్హత కలిగిన వైద్య అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 25-08-2026 ఉదయం 11:00 గంటలకు గద్వాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఈ పోస్టుల్లో ఫోరెన్సిక్ మెడిసిన్ 1, కమ్యూనిటీ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ 2, డీవీఎల్ 1, పీడియాట్రిక్స్ 1, ఆర్థోపెడిక్స్ 1, అనస్థీషియా 2 చొప్పున మొత్తం 09 సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయని తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత తేదీ, సమయానికి అవసరమైన ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.దరఖాస్తు పత్రం, విద్యార్హతలు, ఎంపిక విధానం, నిబంధనలు మరియు ఇతర పూర్తి వివరాలను జోగులాంబ గద్వాల జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.gadwal.telangana.gov.in ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతం చేయాలి

- కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం





పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-21(విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సజావుగా, సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణపై సమీక్షించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ప్రాజెక్టుల పనులు పూర్తయి కొత్త ఆయకట్టు అందుబాటులోకి రావాలంటే భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లను విడుదల చేసిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా భూసేకరణ, పునరావాస పనులను పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలో కొనసాగుతున్న భూసేకరణ వివరాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష మంత్రికి వివరించారు. ధర్మారం మండలం కానంపల్లి గ్రామంలో నూతన చెరువు ఎఫ్‌ఎన్‌టీ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ.5.40 కోట్ల నిధులు విడుదలైనట్లు తెలిపారు. త్వరలోనే రైతులకు పరిహారం చెల్లించి భూసేకరణ ప్రక్రియను పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సూపరిండెంట్ శ్రీధర్,డీఈ రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్ నుండి ఇటిక్యాల వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలి

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కి వినతి
- సర్పంచ్ నాగేష్ యాదవ్



వడ్డేపల్లి ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ పట్టణం నుండి ఇటిక్యాల వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ నాగేష్ యాదవ్, గ్రామాల ప్రజలు శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతినగర్ పట్టణం నుండి ఇటిక్యాల వరకు సరైన రోడ్డు మార్గం లేనందున రైతులు పండించిన పంటను మార్కెట్లకు తీసుకెళ్లడానికి కష్టతరం అవుతున్నదని అన్నారు.అదేవిధంగా ఎనిమిది గ్రామాల ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు సరైన రవాణా సదుపాయం లేనందున ఈ గ్రామాల్లో డ్యూటీ చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు.ఇటిక్యాల రైల్వే స్టేషన్ కు వెళ్లే మార్గం కూడా ఇదే కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని,కావున బీటీ రోడ్డు మంజూరు చేసి ఈ గ్రామాల అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ కు 8 గ్రామాల సర్పంచులు, గ్రామ ప్రజలు, మండల అధ్యక్షులు కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇట్టి విషయంపై సంపత్ కుమార్ సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగేష్ యాదవ్, ఇటిక్యాల మండలం అధ్యక్షులు రుక్మేందర్ రెడ్డి,జగన్ గౌడ్, రామకృష్ణ, తిరుమలేశ్, శ్రీనివాస్ రెడ్డి, అల్లభకాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరి ఇందు కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



ఎర్రవల్లి ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : రెండు నెలల క్రితం కడుపునొప్పితో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఎర్రవల్లి గ్రామానికి చెందిన నీట్ విద్యార్థిని ఉప్పరి ఇందు కుటుంబ సభ్యులకు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును శుక్రవారం ఎర్రవల్లి సర్పంచ్ అనిత కృష్ణసాగర్ వారి ఇంటికివెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇందు కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అలాగే మృతి చెందిన ఇందు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి అండగా నిలిచి సహకరించిన గ్రామ పెద్దలు, యువకులు, సాగర సంఘం పెద్దలు, కులబంధువులు అందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# చట్టాలను పాఠశాల స్థాయి పాఠ్యాంశాలలో చేర్చాలి

- భారత చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- తరాల శివ చరణ్ నాయుడు



విజన్ ఆంధ్ర(21) హైదరాబాద్ : గతవారం పాఠశాల ప్రిన్సిపాల్‌ను పదో తరగతి విద్యార్థులు హత్య చేసిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విద్యార్థుల చేతుల్లో ఇలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా యువతలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మత్తు పదార్థాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడంతో పాటు, పిల్లలకు చిన్న వయసు నుంచే చట్టాలపై అవగాహన కల్పించాలి. మన మారుతున్న జీవనశైలిని ఒకసారి పరిశీలిస్తే, గత 30 సంవత్సరాలతో పోలిస్తే నేటి సమాజంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. అప్పట్లో కుటుంబాల్లో మానవత్వం, ప్రేమ, ఆప్యాయతలు, బంధుత్వాలకు ఎంతో విలువ ఉండేది. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా మనిషి విలువలు, కుటుంబ బంధాలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచే మనస్తత్వం ఉండేది. ఆ రోజుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులో లేకపోయినా మనుషుల మధ్య సంబంధాలు బలంగా ఉండేవి. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారి మధ్య అనుబంధం ఎక్కువగా ఉండేది. సమస్య వచ్చినప్పుడు కలిసి పరిష్కరించుకునే సహనం, సంయమనం ఉండేది. కానీ నేడు మారుతున్న జీవనశైలి, సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ, సామాజిక మాధ్యమాల ప్రభావంతో పిల్లల ఆలోచనా విధానంలో కూడా వేగంగా మార్పులు వస్తున్నాయి. చిన్న వయసులోనే వివిధ రకాల సమాచారాన్ని వారు మొబైల్ ఫోన్లు, సినిమాలు, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసు కుంటున్నారు, అందులో మంచి విషయాలతో పాటు హింస, మత్తు పదార్థాలు, నేరాలు వంటి ప్రతికూల అంశాలు కూడా వారి దృష్టికి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలకు చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. తమ హక్కులు ఏమిటి, తమ బాధ్యతలు ఏమిటి, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి, నేరం అంటే ఏమిటి, ఇతరుల హక్కులను గౌరవించడం ఎందుకు అవసరం, వంటి విషయాలను చిన్న వయసులోనే వారికి అర్థమయ్యే విధంగా బోధించాలి. అందుకే పాఠశాల స్థాయి నుంచే ప్రాథమిక చట్టాలపై అవగాహన కల్పించే ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రవేశ పెట్టాలి. విద్యార్థుల వయసుకు అనుగుణంగా రాజ్యాంగ విలువలు, పౌరుల హక్కులు బాధ్యతలు, బాలల రక్షణ చట్టాలు, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, నేరాలకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలు వంటి అంశాలను బోధించాలి. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును ఎలా నాశనం చేస్తాయో, వాటి వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై ఎలాంటి ప్రభావం పడుతుందో విద్యార్థులకు స్పష్టంగా వివరించాలి. పాఠశాలలు, తల్లిదండ్రులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కోగలం. చట్టంపై విద్యార్థుల్లో భయం కంటే గౌరవం, బాధ్యత పెరగాలి. చట్టం ప్రతి ఒక్కరికీ సమానమనే భావన చిన్నతనం నుంచే కలగాలి. నైతిక విలువలు, మానవత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో పాటు చట్టపరమైన అవగాహన కూడా విద్యలో ఒక ముఖ్యమైన భాగంగా మారాలి. రేపటి సమాజాన్ని నిర్మించేది నేటి పిల్లలే. వారిని కేవలం మంచి విద్యార్థులుగా కాకుండా మంచి మనుషులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలపై ఉంది. పాఠశాల స్థాయిలోనే చట్టాలపై అవగాహన కల్పిస్తే విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తన పెరుగుతుంది. నేరాల వైపు వెళ్లకుండా ముందుగానే వారిని అప్రమత్తం చేయవచ్చు. ముఖ్యంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించవచ్చు. తద్వారా భవిష్యత్తులో హింసాత్మక ఘటనలు, నేరప్రవృత్తులు తగ్గించేందుకు ఒక బలమైన పునాది ఏర్పడుతుంది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి పాఠశాల స్థాయి పాఠ్యాంశాలలో ప్రాథమిక చట్టపరమైన అవగాహనకు ప్రత్యేక స్థానం కల్పించాలి. ప్రతి పాఠశాలలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, చట్టపరమైన అవగాహన సదస్సులు నిర్వహించాలి. పిల్లల చేతుల్లో పుస్తకం ఉండాలి మత్తు పదార్థం కాదు, వారి మనసుల్లో హింస కాదు మానవత్వం ఉండాలి, చట్టాన్ని ఉల్లంఘించే ధైర్యం కాదు, చట్టాన్ని గౌరవించే బాధ్యత ఉండాలి, అప్పుడే ఆరోగ్యకరమైన, బాధ్యతా యుతమైన సమాజాన్ని నిర్మించగలం.

# గుంతలు తవ్వారు.. కేబుల్ లాగారు.. పూడ్చడం మరిచారు..!

- నెల రోజులు గడిచినా గుంతలు పూడ్చని వైనం
- ప్రజలు, వాహనదారుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం



గద్వాల ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల పట్టణంలోని కృష్ణారెడ్డి బంగ్లా నుంచి రాఘవేంద్ర కాలనీ వరకు అండర్‌గ్రౌండ్ కేబుల్ కోసం తవ్విన గుంతలు ప్రజలకు, వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. కేబుల్ వేసేందుకు గుంతలు తవ్వి దాదాపు నెల రోజులు గడుస్తున్నా వాటిని పూడ్చకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేబుల్ పనులు పూర్తయిన తర్వాత గుంతలను వెంటనే పూడ్చి రహదారిని ప్రయాణానికి అనువుగా చేయాల్సి ఉండగా, సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు, సంబంధిత కౌన్సిలర్, వార్డు అధికారులు సైతం సమస్యను పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణారెడ్డి బంగ్లా సమీపంలో గద్వాల చీరల వ్యాపారం కోసం ఇతర ప్రాంతాల నుంచి నిత్యం వ్యాపారులు, వినియోగదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రద్దీ ప్రాంతంలో రోడ్డుపై గుంతలు అలాగే ఉండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గద్వాలలో చిన్న వర్షానికే రోడ్లపైకి మురుగునీరు చేరే పరిస్థితి ఉంది. అలాంటి సమయంలో ఈ గుంతల్లో నీరు చేరితే అవి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం మరింత పెరుగుతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించి, కేబుల్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌తో గుంతలను వెంటనే పూడ్చించి రహదారిని సురక్షితంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కేబుల్ వేయడం ఎంత ముఖ్యమో, పనులు పూర్తయిన తర్వాత రోడ్డును యథాస్థితికి తీసుకురావడం కూడా అంతే బాధ్యత అనే విషయాన్ని సంబంధిత అధికారులు గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.


# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- 10వ తరగతిలో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలి
- మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలి
- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్భించిన
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్వి



గద్వాల ఆగస్టు 21 (జన్ ఆంధ్ర బ్యూరో) : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం ధరూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించడంతో పాటు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంట, స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కేజీబీవీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ తగు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పాఠశాలలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను కలెక్టర్ పరిశీలించారు. విద్యుత్, డ్రైనేజీ సమస్యలను సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ నందిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రాజెక్టు పరిధిలోని భూ సేకరణ గురించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 21 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డినీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. కొత్తఆయకట్టుసృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నీటిపారుదలప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ , పరిహారం చెల్లింపు,పునరావాసానికి సంబంధించినప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పెండింగ్ భూసేకరణకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూపరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లోసమీకృతజిల్లాకార్యాలయ సముదాయం నుండి జిల్లా కలెక్టర్ కె. హైమావతి, నీటి పారుదల శాఖ ఎస్ఈ, డిఈ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- నోటీసుల జారీ, విచారణకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలి
- ధరూర్ మండల తహసీల్దార్ కార్యాలయంను సందర్శించిన
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ధరూర్ ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సందర్శించిన కలెక్టర్ ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యాపింగ్ కాని, వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు సంబంధించిన నోటీసులను సంబంధిత ఓటర్లకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. నోటీసులు అందించిన అనంతరం విచారణకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువులోగా విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి రికార్డుల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత బిఎల్ఓ లు సంబంధిత మండలాల ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ నందిని, ఇతర రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మూగోనిపల్లి గ్రామంలో చిప్స్, కుర్కురేల విక్రయాలు, వినియోగంపై నిషేధం

- గ్రామస్థుల తీర్మాణం



అయిజ ఆగస్టు 21 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పరిధిలోని మూగోనిపల్లి గ్రామంలో చిన్నపిల్లలు ఎంతో ఇష్టంగా తినే చిప్స్, కురుకురే వంటి జంక్ ఫుడ్ ప్యాకెట్లలో హానికర రసాయనాలు, ప్లాస్టిక్, పేపర్ అవశేషాలు కలసి ఉన్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న ఇటువంటి హానికర ఆహార పదార్థాలను గ్రామంలో సంపూర్ణంగా నిషేధించాలని ప్రజలు తీర్మాణించారు. గ్రామంలో లభ్యమవుతున్న చిప్స్, కురుకురే ప్యాకెట్లకు గ్రామస్థులు బహిరంగంగా నిప్పు పెట్టి దహనం చేసి తమ నిరసన తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ప్రముఖ న్యూరో డాక్టర్ కృష్ణ మూర్తి,




సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :21(విజన్ ఆంధ్ర ): తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రముఖ న్యూరో డాక్టర్ కృష్ణ మూర్తి ప్రారంభించారు . శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోనీ ఎం. యస్. క్రికెట్ అకాడమీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన టోర్నమెంట్ మొదటి మ్యాచ్ తేజ కాలేజీ, లా కాలేజీ టాస్ వేసి డాక్టర్ కృష్ణ మూర్తి ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మూర్తి మాట్లాడుతూ యువత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు చదువు, క్రిడా రంగంలో అద్భుత విజయలు సాధించి జిల్లా అన్నారు.. యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ లకు ఎక్కువ సమయం గడపకుండా మైదానంలో సమయం కేటాయించాలి అన్నారు.. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ, కార్యదర్శి చింతల సాయి కుమార్, ఎల్ వేణు గోపాల్ , ప్రభాకర్ గౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యత గుత్తేదారు కెరుక...!

- కాంట్రాక్ట్ ఒకరైతే పనులు వేరొకరివి
- గుత్తేదారులు అధికారుల కుమ్మక్కు




టేక్మాల్ ఆగస్టు 21: (విజన్ ఆంధ్ర) గ్రామాల్లో కోట్లాది రూపాయల ప్రజాధనంతో జరిగే అభివృద్ధి పనులు నాణ్యతలో డొల్లతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మాది కాదు మా అత్తగారు సొమ్ము అన్న తీరుగా అధికార యంత్రాంగం వ్యవహరించడంతో అక్రమాలకు అడ్డు అదుపు లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు టేక్మాల్ మండలం ఎల్లుపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు పూర్తి చేసి చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేది ఎప్పుడు అని ఎదురుచూస్తున్న ప్రజలు..! రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వేచించి భవనాలను నిర్మిస్తుంటే కొందరు గుత్తేదారులు మాత్రం కనీస నాణ్యత పరిమాణాలు లేకుండా ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారు. భవన నిర్మాణంలో పనులు ఎలా జరుగుతున్నాయో అనే విషయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడానికి ఈ భవనమే నిదర్శనం.. అని తెలుసుకోవచ్చు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ 2024 లో 2.45 లక్షల ఎన్ హెచ్ ఎం (వీఎవీ) జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే కానీ అప్పటినుండి ఇప్పటివరకు ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు నత్త నడక విధంగా కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాంగ పనులు చేస్తున్నాడని ప్రజలలో చాలా విమర్శలు ఉన్నాయి. భవన స్లాబ్ పై ఉన్న బ్రిక్కును సక్రమంగా వేయకపోవడంతో కంకర ఇనుప రాడ్లు తేలి ఉన్నాయి. నాసిరకం ఇసుక సిమెంట్ తక్కువ వాడటం వల్ల భవనం కొన్ని ఏళ్లలోనే శిథిలావస్థకు చేరే ప్రమాదం ఎంతైనా ఉంది ప్రస్తుతం స్లాబ్ వరకు పనులు పూర్తయి నిలిచిపోయాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం బోరు వేసినప్పటికీ మోటర్ బిగించిన బోరులో నీరు లేకపోవడంతో గ్రామానికి సంబంధిత వాటర్ ట్యాంక్ నుండి పైపు బిగించి అక్రమంగా నీటిని తీసుకొని నిర్మాణం కోసం వినియోగిస్తున్నారు. దీంతో గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ త్రాగునీరు ఇబ్బందులు ఎదురవుతున్నాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పనులు ప్రస్తుతం స్లాబ్ పూర్తిగా నీటి క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడంతో భవిష్యత్తులో ప్రమాదంగా మారే అవకాశం ఉంది. తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తిచేసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వివరణ: సంబంధింత కాంట్రాక్ట్ వెంకట్ రెడ్డి కి ఫోన్ చేయగా కాంట్రాక్ట్ ను నేనే కానీ వేరే కాంట్రాక్టర్ హైదర్ పనులు చేపడుతున్నారని నాకు ఎలాంటి విషయాలు తెలియదు అని సమాధానం ఇచ్చాడు ఈ విషయం పై హైదర్ కాంట్రాక్టర్ కు ఫోన్ చేయగా గత ఆరు నెలలుగా బిల్లు లు రావడం లేదని నిర్మాణ పనులు ఆపడం జరిగింది. తెలిపారు.

## 'నైరా' కలెక్షన్‌ను విడుదల చేసిన మలబార్ గోల్డ్



హైదరాబాద్, ఆగస్ట్ 21 (విజన్ ఆంధ్ర) : మలబార్ గోల్డ్, డైమండ్స్ సహజ రత్నాలతో రూపొందించిన 'నైరా' ఆభరణాల కలెక్షన్‌ను నటి, మోడల్ శ్రీనిధి శెట్టి చేతుల మీదుగా విడుదల చేసినట్లు మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి.అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ బ్రాండ్ ముఖచిత్రంగా నటించిన ప్రచార చిత్రాన్ని కూడా శ్రీనిధి శెట్టి ఆవిష్కరించిందని తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో జరుగుతున్న 'జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్'లో భాగంగా ఈ కలెక్షన్‌ను పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. రత్నాలు, అన్‌కట్ ఆభరణాల తయారీ ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు సెప్టెంబర్ 14 వరకు అందిస్తున్నట్లు సంస్థ తెలిపారు. సంప్రదాయ చిల్డై, పచ్చి ఆభరణాల కళను ఆధునిక డిజైన్‌తో మేళవించి 'నైరా'ను రూపొందించినట్లు పేర్కొన్నారు. సహజ రత్నాల ప్రత్యేకత, అత్యున్నత పనితనంతో 'నైరా'ను రూపొందించామని తెలిపారు. ఫెస్టివల్‌లో ప్రత్యేక సహజ రత్నాలు, అన్‌కట్ ఆభరణాలను కూడా ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు.






### చేపల చెరువు అక్రమ కాలువల కథనానికి స్పందన

# జిల్లా ఇరిగేషన్ యంత్రాంగంలో కదలిక

- భూ హద్దులు చెరువు శిఖంపై స్పష్టత ఇవ్వని ఇరిగేషన్ అధికారులు
- బడా బాబులకు అడుగులకు మడుగులు
- నీటిపారుదల రెవెన్యూ యంత్రాంగం
- సమగ్ర విచారణకు గ్రామస్తుల డిమాండ్
- చేపల చెరువు అక్రమ కాలువ పూడ్చివేతకు పూనుకున్న అధికారులు


విజన్ ఆంధ్ర
21 Aug 2026 - Page 4

విజన్ ఆంధ్ర కథనానికి స్పందన

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇరిగేషన్ ఎస్పీకి ఫోన్ ద్వారా సమాచారం

పూర్తిగా నివేదిక ఇవ్వండి





సంగారెడ్డి డెస్క్(విజన్ ఆంధ్ర)ఆగస్టు 21 : చేపల చెరువు కోసం అక్రమంగా నీటిని తరలించడానికి వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి నీళ్ళతరలింపుకు కాల్వలు తవ్వకం అనే శీర్షికతో విజన్ ఆంధ్ర పత్రికలో వరుస కథనాలు ప్రచురితం అయిన విషయం విధితమే.కాగా గ్రామ ప్రజలు



యువకులు ఏకమై విజన్ ఆంధ్ర పేపర్ క్లిప్పింగులతోలి గురువారం జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. అక్రమంగా తీసిన కాలువలను పూడ్చాలని అక్రమ నీటి తరలింపును అరికట్టాలని విన్నపత్రం అందించారు.దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ ఎస్సీని పూర్తి నివేదిక అందించాలని ఆదేశించారు.దీనితో ఇరిగేషన్ డిఈ రవిమోహన్,వర్క్ ఇన్స్పెక్టర్ నాగరాజ్ కలిసి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు.చెరువు వద్ద నుండి అక్రమంగా తీసిన కాలువను పరిశీలించారు. శుక్రవారం ఉదయం రెండు జే సీ బీ లతో అక్కడికి చేరుకున్నారు.నీటి కాలువను పూడ్చివేసే పనులు చేపట్టారు. పూడ్చివేత పనులు కనీసం రెండు,మూడు రోజులు పట్టవచ్చని అధికారులు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ, కసాన్ పల్లి పెద్ద చెరువు నుంచి తీసిన కాల్వలను కలెక్టర్ చొరవ తీసుకొని అక్రమార్కులపై చర్య తీసుకోవడం సంతోషకరమని వారు పేర్కొన్నారు.అక్రమంగా మోటర్లు పెట్టి నీటిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు,యువజన సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ చేపల చెరువు కోసం నీటిని తరలించేందుకు అక్రమంగా విద్యుత్ వినియోగించినందున విద్యుత్ అక్రమ వాడకాన్ని గుర్తించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.చెరువు సర్వే చేసి హద్దులు గుర్తించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రజలకుజ మేలు చేస్తారా ప్రైవేట్ వ్యక్తులను వెనుక వేసుకొస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది


## చేపల చెరువు కోసం అక్రమంగా వాల్టా చట్టాన్ని అధికమించి కాల్వ తవ్వకం

- కసాన్పల్లి పెద్ద చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు
- పైఅధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం: డీఈ రవిమోహన్

అందోల్, ఆగస్టు 18 సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర : ప్రైవేట్ వ్యాపారం సాఫీగా కొనసాగటానికి వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి యథేచ్ఛగా నీటి దోపిడి జరుగుతుంది. అధికారుల అండదండలతో ఈ తతంగం నెల రోజులుగా కొనసాగుతుంది. ఈ వైనం అందోల్ మండలంలోని కన్సాన్పల్లి శివారులో చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ వ్యక్తి వట్పల్లి మండలంలోని ...

ఏకంగా కిలోమీటర్పైగా కాలువ తీశాడు. ఇంతే కాకుండా చెరువు వద్ద భారీ మోటార్లు బిగించి అక్రమంగా విద్యుత్ వాడుకుంటు నీటిని తరలించాడు. ఈ విషయంలో గ్రామస్తులు తమ గ్రామానికి చెందిన చెరువు నుంచి నీటిని తరలించడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఈ సంఘటనను అరికట్టడానికి పూనుకున్నారు. సోమవారం పంచాయతి ఆధ్వర్యంలో నీటి దుర్వినియోగంపై చాటింపు చేశారు. మంగళవారం ఉదయం గ్రామస్తులు అక్రమంగ ...

విజన్ ఆంధ్ర 19 Aug 2026 - Page 4

# అక్షరాలు దిద్దించిన చేతులపైనే నెత్తుటి మరకలా...!!

గురువు అంటే జ్ఞానాన్ని పంచే దైవస్వరూపం.. అలాంటి గురువునే విద్యార్థులు హతమార్చడం సమాజాన్ని కలచివేస్తోంది. టెన్త్ చదువుతున్న చిన్నారుల చేతుల్లో ఇంతటి క్రూరత్వం ఎలా పెరిగింది? అసలు తప్పెక్కడ జరుగుతోంది? విద్యాబుద్ధులు నేర్పాల్సిన వయసులో హింసకు పాల్పడుతున్న ఘటనలు భవిష్యత్ తరాలపై ఆందోళన కలిగిస్తున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి పిల్లల ఆలోచనా విధానాన్ని గమనించాల్సిన సమయం ఆసన్నమైంది. గురువును కాపాడుకోలేని సమాజం..రేపటి తరాన్ని ఎలా కాపాడుకుంటుంది? -విజన్ ఆంధ్ర స్పెషల్ సెంటిమెంట్ అండ్ అవేర్నెస్ స్టోరీ

### విద్యార్థుల మదిలో మాయమవుతున్న సంస్కారం

### గురువు ప్రాణం తీసే బరితెగింపా?

### పిల్లలు కాదు... సమాజానికి చీడపురుగులు

### హోమ్‌వర్క్ అడిగితే హత్యాయత్నమా?

### బడి పోరగాళ్ల పైత్యంపై సమాజం నిప్పులు!!

హైదరాబాద్, ఆగస్టు 21:
బడి గడప దాటిన పైత్యంపై సమాజం నిలదీత ఒకప్పుడు బడి అంటే దేవాలయం. ఉపాధ్యాయుడు అంటే దైవ సమానుడు. తప్పు చేస్తే వీపు విమానం మోగినా, అది తమ భవిష్యత్తు కోసమేనని గ్రహించి చేతులు జోడించిన సంస్కృతి మనది. కానీ నేడు సీన్ మొత్తం రివర్స్ అయింది. చేతిలో పుస్తకం ఉండాల్సిన చోట కత్తులు, మదిలో విజ్ఞానం ఉండాల్సిన చోట కక్షలు రాజ్యమేలుతున్నాయి. చిన్న మందలింపును కూడా భరించలేని అహంకారం, తమకు నచ్చినట్లు




ఉండనివ్వలేదన్న వికృత కోపం... కన్నవారి కడుపుకోతగా, గురువుల ప్రాణాల మీదకు తెచ్చే మారణాయుధంగా మారుతోంది.

**క్లాస్‌రూమ్‌లో క్రైమ్ థ్రిల్లర్ సీన్లు!!**

సినిమాల్లోని గ్యాంగ్‌స్టర్ కల్చర్, సోషల్ మీడియాలో కనిపించే ఇన్‌స్టంట్ ఫేమ్ మాయలో పడి కొందరు విద్యార్థులు విచక్షణ కోల్పోతున్నారు. హోమ్‌వర్క్ అడిగితే కోపం, క్లాస్‌కు లేట్‌గా వస్తే ప్రశ్నించినందుకు పగ, పరీక్షల్లో కాపీయింగ్ ఆపితే కక్ష. ఫలితం... జీవితాన్ని తీర్చిదిద్దే గురువులపైనే విచక్షణారహితంగా కత్తులతో దాడులు చేయడం. ఇది కేవలం క్రమశిక్షణా రాహిత్యం మాత్రమే కాదు, సమాజం అంతా తలదించుకోవాల్సిన భయంకరమైన మానసిక రోగం.

**తల్లిదండ్రుల అతిగారాబం... పెడదోవ పడుతున్న భవిష్యత్తు!!**

ఆన్‌లైన్ వ్యసనం
రీల్స్, మొబైల్ గేమింగ్ తెస్తున్న దూకుడు భావోద్వేగాలను నియంత్రించుకోలేని స్థితికి నెడుతోంది.

**స్పర్శ లేని పెంపకం**




పిల్లలు ఏం చేస్తున్నారు, ఎవరితో తిరుగుతున్నారు అన్నది పట్టించుకోకుండా అడిగినంత డబ్బు చేతిలో పెట్టడం అతిపెద్ద తప్పిదం.

**మందలింపులను తప్పుపట్టడం**

స్కూల్లో టీచర్ ఏదైనా అంటే చాలు, పిల్లాడి తప్పు తెలుసుకోకుండా ఉపాధ్యాయులపైకే గొడవకు వెళ్లే ధోరణి పిల్లల్లో "మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అనే బరితెగింపును పెంచుతోంది.
చదువు నేర్పే గురువునే చంపాలనుకునే ఆలోచన వచ్చినప్పుడే ఆ వ్యక్తిత్వం సమాధి అయిపోయినట్లే. కష్టపడి కని పెంచిన తల్లిదండ్రులకు తీరని కలంకం, దేశానికి శాపంగా మారే ఈ 'చీడపురుగుల' సంస్కృతికి ఇప్పుడే అడ్డుకట్ట పడాలి. చట్టపరమైన కఠిన చర్యలతో పాటు, ఇళ్లల్లో విలువలతో కూడిన పెంపకం మొదలుకాకపోతే... రేపటి తరం నడిచే దారి మరింత అంధకారంగా మారే ప్రమాదం ఉంది. బడులు జ్ఞానాన్ని పంచే కేంద్రాలుగానే మిగలాలి తప్ప, నేరాలకు వేదికలు కాకూడదు.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.